# సత్యం

పాలడుగు వెంకటేశ్వరరావు



(మొదటి భాగం)

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. ఉదయ సంధ్య కారుచీకట్లని పారద్రోల టానికి ప్రయత్నిస్తూ వుంది. అప్పుడే లేచిన కొన్ని కాకులు 'కా-కా' అంటూ అరుస్తూ ఎగుర్తూ పోతూ వున్నాయి. తలార స్నానంచేసిన సీత జారుముడి వేసుకుని కలియంపి చల్లిన వాకిట్లో ముగ్గులు దిద్దుతూ వుంది అప్పుడే నిద్రలేచిన సుబ్బమ్మ కళ్ళు నులుముకుంటూ వాకిట్లోకి వచ్చింది.

"ఇంకా ముగ్గుల్లోనే వున్నావటే అమ్మాయి!" అంటూ పలకరించింది కూతుర్ని.

"అయిపోయిందమ్మా."

"పాలవాడు వచ్చి వెళ్ళేడా?"

"ఆఁ పాలు పోయించుకొని వంట గదిలో పెట్టేను."

"సర్లే త్వరగా ముగించి వచ్చి కాఫీ చెయ్యి. మళ్ళీ రాజుగాని వస్తే కాఫీ అని చిందులు తొక్కుతాడు. ఈలోగా నా మొహంపని కానిచ్చుకొని వస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది సుబ్బమ్మ.

వేసిన ముగ్గుల్ని తృప్తిగా ఒకసారి చూసుకుని చెంగున లోపలికి నడిచింది సీత. పొయ్యితో కుస్తీపట్టి వెలిగించి, డికాషన్ కలిపి గ్లాసుల్లో కాఫీ తయారు

చేసిందో లేదో 'కాఫీ' అంటూ అరిచాడు రాజు. కాఫీ గ్లాసు తీసుకుని గదిలోకి వెళ్ళింది సీత. కళ్ళుమూసుకునే నిద్ర ఐద్ధకంలో ఆవలిస్తున్నాడు రాజు.

''ఇదిగో, కాఫీ.''

రాజు కళ్ళు విప్పిచూసాడు. "ఇంతా లస్యం అయిందేం ఇవాళ?" నిష్ఠురిస్తున్నట్లు అడిగాడు. సీత మెదలకుండా గ్లాసు అందించింది. కాఫీ తాగి గ్లాసు క్రిందపెట్టి, "మాట్లాడవేంటి, నోరు లేదా?" అన్నాడు.

"ఏంలేదు."

"ఏంలేకపోవటమేమిటి?"

"ఇవాళ పాలవాడు గొడవచేసాడు. అతనిది క్రితం నెల డబ్బు ఇంకా ఇవ్వలేదు. ఇక పొయ్యనని అన్నాడు. ఎలాగో సర్దిచెప్పితే పాలుపోసి వెళ్ళాడు."

"ఏం? అతని పైసలు ఎందుకు ఇవ్వలేదు?"

"ఆ డబ్బులు నీకే ఏదో ఫీజుకంటే ఇచ్చానుగా."

"ఆహా! మెడకి వేస్తే కాలికి, కాలికి వేస్తే మెడకి. చివరికి నన్నే దోషిగా చేసావన్నమాట."

"అదిగాదన్నయ్యా..."

"సర్లే, సర్లే. అదంతా నా కనవసరం" అంటూ విసుక్కున్నాడు రాజు. ఖాళీ గ్లాసు తీసుకుని, తిరిగి వచ్చేస్తోంటే వెనక్కి పిల్చి గుసగుస అన్నాడు. ''అవునుగాని డబ్బులేవన్నా వుంటే ఇవ్వరాదూ? అర్జంటు పని వచ్చిపడింది!"

లేవన్నట్టు తలాడించింది.

"ఎంతో వద్దు. ఓ పెన్నుంటే చాలు."

"ప్చ్" అంది.

"పోనీ ఓ పైవన్నా..."

"ఊహూ."

"నాకు తెలియమూ. నువ్వసలే పిసినిగొట్టువి. అందుకే నువ్వంటే నాకు కోపం!" అంటూ చిటచిట్లాడాడు రాజు. నవ్వి ఇవతలకి వచ్చేంది సీత.

అప్పటికే వంటగదిలో పీటమీద కూర్చుని కాఫీ తాగుతూ ఆపసోపాలు పడుతూ వుంది సుబ్బమ్మ.

"లలితకి కాఫీ ఇచ్చేవటే?"

"ఇంకా అది లేవలేదమ్మా."

"లేవలేదూ! పోనీ నువ్వన్నా నిద్ర లేపకపోయావ్? కాఫీ చల్లారితే అదసలే ముట్టుకోదు. అసలే అర్భనాకారిపిల్ల" తప్పంతా సీతదే అన్నట్టు నిర్ధారించింది ఆవిడ.

లలిత ఇంకా ముసుగుతన్ని కలలు కంటూనే వుంది.

సీత తనని నిద్రలేపేటప్పటికి కస్సుమంది, లలిత.

"ఏం కొంప మునిగిపోయిందని నిద్ర చెడగొట్టేవ్?" అంటూ చిందులు తొక్కింది. నోట్లో అటు ఇటు బ్రష్షు

అడించి వచ్చి కూర్చుని గారాలుపోతూ కాఫీ తాగింది. ఈలోగా బాయిలర్ ముట్టించి
వచ్చింది సీత.

"అమ్మా" గారాలు పడుతూవుంది లలిత. లలితను ఒళ్లో కూర్చోబెట్టుకుని తలకి నూనె రాస్తూ,?

"నీళ్లు కాగాయటే?" అంటూ సీతని అడుగుతూ వుండింది సుబ్బమ్మ.

"కాగుతున్నాయమ్మా."

"అమ్మోవ్!" అంటూ గావుకేక పెట్టింది లలిత.

"ఏమిటే తల్లీ."

"ఒక మాట చెప్పనా?"

"చెప్పుమరి" అంటూ కూతురి తల నిమిరింది. ఆమె ఆప్యాయంగా.

"డబ్బులు కావాలే!"

"ఎందుకే? ఎంత కావాలి?"

"ఎంతోనా? పాతిక మా ఫ్రెండ్సంతా కలిసి పార్టీ ఎరేంజ్ చేసుకుంటున్నాం" 'రమణి' లేదూ? ఆర్డివో గారమ్మాయి. ఆయనకి హైద్రాబాదు ట్రాన్స్ఫరయింది. ఆ అమ్మాయి వెళ్ళిపోతుంది. అందుకనీ,

"పాతికా?! నా దగ్గరెక్కడుంది? నాన్ననడుగు."

"ఆయనకసలే కోపం నేనడుగను బాబూ! ఐనా ఆయన నాకు దొరకద్దూ?"

"మరేంచేస్తావు?"

"ఏవో! నువ్వే ఇవ్వాలి?", అంటూ తీర్మానించి బుంగమూతి పెట్టింది లలిత.

"డబ్బు డబ్బు అని ప్రాణాలు తోడుతారు. అందరికీ డబ్బుకావాలి. ఎక్కడ్నుంచి తేనే? ఇది సంసారంకాదు దీన్ని ఇక నేను ఈదలేను. 'ఆ మనిషి' బాధ్యత పట్టకుండా తిరుగుతారు. ఆ శ్రీరామచంద్రమూర్తికి నా మీద దయలేదు...!

"ప్రొద్దున్నే ఎందుకమ్మా అటువంటి మాటలు!" అంది సీత, నిట్టూర్చి. కస్సుమంది సుబ్బమ్మ.

"అవునే నీకేం? ఎన్నయినా చెపుతావు. నా బరువు నువ్వు మొయ్యి. తెలుస్తుంది. ఒడ్డునుంటే నేనుకూడా ఎన్ని నీతులైనా చెపుతాను."

"సర్లే వూరుకో అమ్మా" అంది సీత.

"దానమ్మకడుపు మాడ. వూరుకో వూరుకో అని అందరూ నా నోరు మూయించేవాళ్ళే. సరే నోర్మూసుకుంటాను. ఇప్పుడిది డబ్బో అని నా ప్రాణాలు కొరికేస్తూవుంది. ఏంచేస్తావో చెయ్యి"

"అమ్మా! ఆ సంగతి నాకొదులు నువ్వు నిశ్చింతగా వుండు. అసలే బ్లడ్ ప్రెషర్ మనిషివి."

"అక్కడికి నేను రోగిష్టినీ, ఈ సంసారాన్ని పీడించుకు తింటున్నదాన్ని అనేగా నీ వుదేశ్యం?"

"ఉద్దేశ్యాలదాకా ఎందుకులే తల్లీ. అసలు నాదే తప్పు. అవసరంకొద్దీ ఏదో

అడిగితే ఇంత రాద్ధాంతం చేశావు ?! రా అక్కా.'' అంటూ లేచింది లలిత.

"నేను రాద్ధాంతం చేసేనుటే ?!" అంటూ నోరు వెళ్ళబెట్టింది సుబ్బమ్మ.

"ఆఁ. అక్షరాలా. ఇకనయినా ఈ రాద్ధాంతం చాలించు." అంటూ సీతని చెయ్యిపట్టుకుని విసవిసలాడ్కుపోయింది లలిత. లాక్కుపోయి—

"అక్కా మరి నా మాట" అంది.

"లలితా పార్టీతప్పకుండా ఇవ్వాలా? పోనీ నువ్వు మానేయకూడదూ?" అంది అనునయంగా సీత.

"అదుగో ఆటువంటి మాటలంటేనే నాకు మంట." అంటున్న లలిత మొహం ఎర్రబడింది.

"సర్లే యిప్పుడు ఏంచేద్దామంటావు?" నీరుగారిపోతూ అంది.

"ఏంచేస్తావో నాకు తెలీదు మాటి చ్చావు ?"

"ఇప్పుడు నా దగ్గర అంత పైకం లేదు. బాకీలు అలాగే వున్నాయి. రోజూ వాళ్ళు పీడించుకు తింటున్నారు. ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. నెల గడ వాలి ..."

"అక్కా!" తీవ్రంగా అంది లలిత సీత నిశ్చేష్ట అయింది.

మరల లలితేఅందుకుని ''నాకు కథలు చెప్పబాకు. అవన్నీ వినే ఓపిక నాకు లేదు."అంది.

సర్లే ఆఫీసులో ఎవర్నయినా అప్పు అడుగుతాను. ఎప్పట్లోగా కావాలి నీకు ?

నువ్వేంచేస్తావో నాకు తెలీదు రేపు సాయంత్రంలోగా పైకం కావాలి. నే నప్పుడే పేరు ఇచ్చేస్తాను." అంటూ స్నానానికి వెళ్ళింది లలిత,"

సీత గుండెల్లోంచి బరువుగా నిట్టూర్పు వెలువడింది.

అప్పటికే స్నానం ముగించి చొక్కా గుండీలు పెట్టుకుంటూ వచ్చాడు రాజు.

"మైడియర్ చెల్లాయ్ !" అంటూ స్వీట్‌గా పిలిచేడు. తలెత్తి చూసింది సీత. ఎవరికయినా అంత కఠినత్వం పనికిరాదమ్మాయ్, నేనడిగింది ఏం చేసావ్ ? నువు ఎంతయినా ఉద్యోగస్తు రాలివి. నువ్వు తల్చుకుంటే పదిరూపా యలు అంత లెక్కలోది గాదు. ఎందు లోంచయినా సేవింగ్సుని ఇటు సర్దా వచ్చు. అవతల ప్రాణం పొయ్యేపని తగలడిందన్నాను గదా?"

సీత కళ్ళు వప్పచెప్పి చూస్తూ వుండి పోయింది.

"లలితలాగే నేనూ నీ తోడబుట్టిన వాణ్ణే. అంతలోనే అంత పక్షపాతం పనికిరాదమ్మాయ్. దేవుడూరుకోడు. కనక 'దాంతో' పాటే నాకూ ఓ ఇంత సర్దు. కావాలంటే లెక్కరాసుకో. ఏదీ- ఈ చదువయి వుద్యోగస్తుణ్ణయ్యాక వడ్డీతోసహా తీరుస్తాను. ఇంకా అను మానమయితే కాగితం రాసిస్తాను.

నువ్వు 'వూ' అను మరి" అంటూ గడ్డం పుచ్చుకొని బ్రతిమాలాడు.

చివరికి సీత చేత 'వూ' అన్పించుకుని వెళ్ళేడు, విలాసంగా.

"ఏం చేస్తున్నావే, అమ్మాయీ!" అంటూ లోపల్నుంచి గావుకేక వేసింది సుబ్బమ్మ.

అంతలో కాలు ఎగరేసుకుంటూ శశిధర్ వచ్చాడు.

"ఎక్కడికి వెళ్లేవురా?" అప్యాయంగా అడిగింది, సీత.

"ఇక్కడికేలే, నే నెక్కడికెళ్తే ఎవరిగ్గావాలి! ఆకరాడ్ని, కుంటి వాడ్ని."

"అట్లా అనకు బాబూ! తప్పు. మొహం కడుక్కురా. త్వరగా రావాలి."

"కడిగేసాలే."

"అయితే రా, కాఫీ తాగుదుగాని."

"నా కాఫీ అయిపోయిందిలే అక్కా, అమ్మ ఇచ్చింది. సర్లేగాని ఆ 'అన్న మహానుభావుడు' ఏంటడుగుతున్నాడు?"

"ఏం లేదులే" అంది సీత. శశిధర్ పేలవంగా నవ్వాడు.

"అక్కా! నేనంతా విన్నా గాని నువ్వు ఆయనకి డబ్బులు ఇవ్వమాకు. ఎంతసేపూ ఇంట్లోవాళ్ళని పీడించి డబ్బుపట్టుకెళ్ళి తగలెయ్యటం బాగా అలవాటయింది. సంపాయించే వాళ్ళయితేగా డబ్బు విలువ తెలియటానికి."

"బాబూ! నువ్వు చిన్నవాడివి. అవన్నీ నీకెందుకు?"

"నిజమే. చిన్నవాడు పెద్దమాటలు అడరాదు. అయినా అంతా నా కళ్ళకి స్పష్టంగా అవుపిస్తోనే వుందక్కా. నువ్వు ఇట్లాగే చేస్తూపోతే ఇక వాళ్లె పట్టీకి బాగుపడరక్కా. చేతులార నువ్వే వాళ్లని చెడగొట్టున్నావు. తర్వాత ఏమనుకునీ లాభంలేదు."


సీత నిట్టూర్చింది.

"ఏమే సీతా! పలకవేంటి? ఏమయిపోయావ్! ఎక్కడ పని అక్కడే తగలడి చచ్చింది. మరి కాసేపటికే అవురావురుమంటూ వస్తారు అందరూ."

"ఇదుగో వచ్చేను అమ్మా."

"ఆ వంటప్రయత్నమేదో చూడు. మళ్ళీ ఆఫీసుకి టయిమయిందని కాళ్ళు తొక్కుకుంటావు. అప్పుడు నేనే కంగారుపడి చావాలి. ఏం మనుషులూ? ఎవరికీ ఏమీ పట్టదు."

తల్లి సుబ్బమ్మ చదువులు వింటూనే పొయ్యిమీద ఎసరు పెట్టింది సీత. బుట్టలో నాలుగు వంకాయలు మిగిలి వున్నాయి. అవి తరిగిపెట్టి ఎసట్లో బియ్యంపోసింది. అన్నం దింపాక ఆ నాలుగు వంకాయ ముక్కలూ వేసింది. వేగాక దించి గిన్నెలో పెట్టి మూత పెట్టింది. ఆ పనీ




ఈ పనీ సర్దుకుని, వంటగది అదీ సర్ది, వచ్చేసరికి తొమ్మిదయింది?

గబగబా తలదువ్వుకుని బొట్టు పెట్టుకుని తయారై ఇవతలికి వచ్చేసరికి తొమ్మిదింపావయింది. కంగారుగా జోళ్ళు వేసుకోపోతుంటగా సుబ్బమ్మగారు వచ్చింది.

వచ్చి, 'అన్నం తిన్నావుటే?' అంది.

అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది సీతకి, తను అన్నం తినలేదనీ - తినకపోతే సాయంత్రంవరకూ ఇక తినటానికి వీలవదనీ.

"పిచ్చిమోడు, అన్నీ నేనే చూసుకోవాలి రా కంచంలో పెట్టాను. గబగబ నాలుగు మెతుకులు తినిపో."

"వద్దులే, అమ్మా. టయిములేదు, మళ్ళీ బస్సు దొరకదు. ఆఫీసులో 'ఇన్స్పెక్షను' జరుగుతూవుంది. బావుండదు" అంది సీత.

"ఇదిగో రా, అక్కా. ఒక్క నిముషంలో ముగించవచ్చు" అంటూ కంచం తెచ్చి చేతిలో పెట్టాడు శశి కంచంలో ఇంత అన్నమూ, నాలుగు వేపుడు ముక్కలూ వున్నాయి.

సీత కనులు ఆప్యాయతనివర్షించాయి కొన్ని క్షణాలపాటు తమ్ముణ్ని చూసి గబగబ రెండు ముద్దలు నోట్లో వేసుకుని ఇన్ని మంచినీళ్ళు తాగి చెయ్యి కడుక్కుంది. కంగారుగా ఉరుకుల పరుగులతో కాళ్ళు తొక్కుకుంటూ సీత వెళ్తూవుంటే గుమ్మంలో నిలబడి శశిధర్ చెయ్యివూపాడు. బస్టాండులో క్యూ కొండపీటి చేంతాడులాగా వుంది. ఆఫీసుకి చేరేసరికి పావుగంట ఆలస్యం అవనే అయ్యింది.

"ఏం ఇంతాలస్యం అయింది ! 'మేనేజరుజీ' మండిపడ్తున్నాడు" అంది 'కో టైపిస్టు' సుజాత. అప్పటికే ఒకసారి తలెత్తి క్రీగంట సీతని చూసి మరల తలొంచుకున్నాడు మేనేజరు మాణిక్య రావు.

"గుడ్మార్నింగ్ సర్" అంది సీత ఆయన దగ్గరకెళ్ళి.

అతను తలపూవి గుర్రున చూసాడు.

"ఇవేళ కొద్దిగా లేటయిందండి" అంది సీత నవ్వి. అతను కస్సుమని అందుకున్నాడు. " ఎందుకవదూ? నాకు తెలియదా ? షికార్లు, బాయ్ఫ్రెండ్సు పాపం ! వీటితో మీకు తీరికెక్క డుంటుంది ? అసలు మీకు ఈ వుద్యో గాలు చెయ్యటం ఎందుకూ అని ? శుభ్రంగా ఇంట్లో కూర్చునో, బజార్లో తిరుగుతునో, కాలం గడిపితే ఎవరడి గాడు ? ఈ వుద్యోగాలెందుకు ? ఈ 'లేటు కమింగు' లెందుకు ? మా ప్రాణాలు తీయటం ఎందుకు ? అసలే ఇన్స్పెక్షను రోజులు గదా ! ఆ. ఆ మాత్రం తెలుసుకోకపోతే ఎల్లాగా అని ? ప్చ్...."

ఆ ! అక్షింతలు వేసుకుని, అటెం డెన్సు రిజిష్టరులో సంతకంపెట్టి వచ్చింది సీత.

"ఏంటి 'వృద్ధ జంబుకం' చదువులు చదువుతూ వుంది" అంది సుజాత టైపు చేస్తూనే.

"ఏముంది ? మామూలే" అంటూ నవ్వి మిషనుమీది కవరుతీసి దుమ్ము దులిపింది సీత. చెయ్యవల్సిన స్టేట్ మెంట్సు 'బొత్తి'గా పడివున్నాయి. చకచక వేళ్ళు కదిలాయి. మెషీను నడకలో కాలం ఇరుక్కుపోయింది.

మాణిక్యరావుకి నలభై ఏళ్లుంటాయి. ఇద్దరు పిల్లల్ని కని చరిత్ర సృష్టించి, భార్య చచ్చిపోయింది గుండెజబ్బుతో. ఆ భార్యతో గతకాలంలో అతను నానా యాతనలూ పడ్డాడు. ఆమె పోయి నప్పుడు ఒక ఏడ్పు ఏడ్చి తరువాత తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు. ఆ కారణంగా అతను 'స్త్రీ ద్వేషి'గా మారాడు. ఆఫీసులో ఎప్పుడూ స్త్రీలని విమర్శిస్తూ కసి తీర్చుకోవటం అతని హాబీ

లంచవర్లో-గంటమ్రోగింది. అప్పుడు పని ఆపి ప్రక్కకి తిరిగిన సీతని చూసి సుజాత పలకరించింది 'అలా కాంటీనుకి వెళ్ళి వద్దాం. వస్తావా !' 'ఉహు' అంది సీత. 'ఏం ? సింగిల్ కాఫీ తాగివద్దాం రారాదా ?'

"వద్దులే, నాకు తాగాలని లేదు. పని మిగిలిపోయింది. నువ్వు వెళ్ళిరా" అంది సీత. 'సర్లే' అంటూ వెళ్ళి పోయింది సుజాత. ఆఫీసు అంతా ఖాళీ అయింది. మాణిక్యరావు ఒక్కడూ కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

టైపుచేస్తున్న సీత ఉలికిపడింది — కాసేపయాక.

తన వెనకాల ఎవరో నిలబడివున్నట్లు అన్పించింది ఆమెకి.

"సీతా!" వెనకనుంచి మాణిక్యరావు పిల్చాడు. ఆ పిలుపులో సౌమ్యత వుంది, ఆదరం వుంది, ఆప్యాయతా వుంది.

"యస్సర్."

"ఈ సార్లూ, గీర్లూ తీసెయ్యి సీతా! ఎవరూ లేనప్పుడు కూడా ఇవేంటి?"

సీత మౌనంగా వుండిపోయింది. వేళ్ళు చకచకా కదిలాయి. చట్రం కదల్లమైతే ఆగలేదు.

"నిన్న మీ నాన్న వచ్చాడు, నా దగ్గరకు!" అన్నాడు మాణిక్యరావు

"వచ్చారా!" అంది సీత ఆశ్చర్యంగా.

"వచ్చి ఒక యాభయి కావాలని పుచ్చుకొని వెళ్ళేడు. నీ మొహం చూసి ఇచ్చేను. లెక్కరాసేననుకో. అయినా ఆయనకి అంత అవసరం తరుచూ అలా ఎందుకొస్తుందబ్బా! ఆ మాటే అలో చిద్దామని నీ దగ్గరికి వచ్చాను."

"పోన్లెండి. మొత్తం ఎంతయిం దంటారు!"

"అన్నీ కలిపి రెండున్నర వంద లయిందనుకో."

"నర్లెండి. నే తీర్చేస్తాన్లెండి."

"నువ్వు తీర్చవని కాదనుకో. ఆయన్ని నువ్వు ఎప్పుడయినా అడి గేవా! ఆ డబ్బు అతను ఏ అవసరం కొరకు ఖర్చుపెడుతున్నాడో కనుక్కు న్నావా? జెన్యూయనేనా?..."

"సంసారం అన్నాక ఏవో ఖర్చు లుంటాయి లెండి."

"నిజం సుమా! నా కంటే నువ్వే మెరుగు సీతా! ఇంకా పెళ్ళికాక పోయినా సంసారపు సంగతుల్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్నావు. ఏదీ! ఈ మధ్యన నా మతి మతిలోనే వుండటంలేదు! ఏదో పైకి అలా వాగు తానుగాని వాస్తవానికి నాకు నువ్వు అంటే ఎంతో అభిమానం సుమా! అది నువ్వు గ్రహించాలి..."

"థాంక్సండి."

"ఆఁ. అలా అని నువ్వు గ్రహిస్తే చాలు, పని జాగ్రత్తగా చేసుకో. ప్రపం చము మంచిదిగాదు. స్నేహం స్నేహం అంటూ స్నేహితురాళ్ళే గోతుల్లోకి దింపి వదిలేస్తారు ఈ స్నేహాలు మానెయ్యి. నా యిల్లు బంగారంగాను. నీకే ఎన్ని సలహాలు చెపుతున్నాను! దేవుడు మేలు చేస్తే నీ చేతే సలహాలు చెప్పించుకో వాల్సినవాడ్ని," నవ్వాడు.

"ఆఫీసు పనిలో ఏవయినా 'ఇన్ట్సక్షన్స్' ఇస్తారా?" అంది సీత చిరాకేసి వాగుడు ఆపి కాసేపు సీతకేసి చూసి" "నేనిచ్చేదేముంది! నువ్వేచేసుకుపోగలవు మెరికలాంటి పిల్లవి" అని మరల నవ్వాడు

మాణిక్యరావు. ఆ నవ్వు ముళ్లతో పొడిచి నట్లనిపించింది సీతకి.

అంతలో సుజాత వచ్చింది, కాంటీను నుంచి.

''ఏమిటి సర్ ! లంచవర్లోకూడా ఏదో శ్రమ పడుతున్నారు ?" అని నవ్వింది సుజాత.

మాణిక్యరావు వెకిలిగా నవ్వాడు

"సీతకి ఈ స్టేట్‌మెంట్లో ఒక విషయం అర్థంకాలేదంటేను, చెప్తామని వచ్చాను. తప్పా ?"

తప్పని ఎవరన్నారండి. ఆ మాట మీరే అంటున్నారు ?" మొహాన్నే నవ్వింది సుజాత. "అదుగో ఆఫీసులో అలా నవ్వవద్దనే నేననేది, సర్లే కానీండి ఆ స్టేట్‌మెంట్లు సాయంత్రాని కల్లా అవాలి రేపే ఆఫీసరుగారిచేత సంతకం చేయించాలి. వాట్ని హెడ్డాఫీసుకు పంపించాలి త్వరగా కానీండి తప్పులు మాత్రం దొర్లనీరాదుసుమా" అంటూ తన సీటుకి వెళ్ళిపోయాడు మానిక్యరావు

ఒకొక్కరే స్టాఫ్ రాసాగారు, కాంటీనునుంచి.

తనసీటులో కూర్చుని కాగితాలు సెట్ చేస్తూ "ఏమిటంటున్నాడు ముసలి పీనుగ ?" అని అడిగింది సుజాత తన మామూలు ధోరణిలో.

"ఏదో అనాలని ప్రయత్నం ఎలాగ అనాలో తెలీక అదీ ఇదీ అనబోయాడు'' నవ్వింది సీత.

"సర్లె. జాగ్రత్తగా వుండు." అని హెచ్చరించింది సుజాత. సీత తలూపింది.

"మరేంలేదు నీమీద కన్నేసాడు. ఉత్త స్కౌండ్రల్. ఇదివరకు ఇలాగే నా జోలికి రాబోతే గట్టిగా బుద్ధిచెప్పాను అప్పట్నుంచి నేనంటే మంట ! ఇటు వంటివిషయాల్లో మనం గట్టిగా వుండాలి లేకుంటే 'పీట్లు' మున బ్రతుకుల్ని మనం బ్రతకనీకుండా చేయగలరు !"

ఆ స్టేట్‌మెంట్లయ్యే సరికి అయిదు దాటింది ఆఫీసు బయటికి వచ్చి గాలి పీల్చుకున్నారు ఇద్దరూ.

"ప్రస్తుతం నీకు అర్జంటుపని ఏమన్నా వుందా ?" అని అడిగింది సుజాత.

"మరేం లేదనుకో. కానీ త్వరగా ఇంటికి వెళ్ళాలి, ఇంటిపని వుంది. అంది సీత. "సర్లె నిన్ను త్వరగానే వదులు తాను గాని నువ్వు ఒకసారి మా యింటికి వచ్చి వెళ్ళాలి. ఇవాళ నా 'బర్తుడే' అంది తనే మళ్ళా.

"మెనీ హాపీ రిటర్న్స్"

"థాంక్యూ. పెద్దగా ఏమీ లేదనుకో. చిన్న టీ పార్టీ. ఎవర్నీ పిలవలేదుకూడా నిన్నొక్కదాన్నే పిల్చాను."

"థాంక్స్ కానీ...!

"కానీలు అర్థణాలు ఎప్పుడో పోయాయి. త్వరగా వదుల్తానన్నాను గదా !" అని రిక్షా పిల్చింది సుజాత ఇద్దరూ ఎక్కారు.

ఇల్లు దగ్గరవుతూవుండగా చెప్పింది సుజాత.

"సీతా! దుర్గారావు వచ్చాడు."

"సీత గుండె ఝల్లుమంది! అప్రయత్నంగానే గుండెమీద చెయ్యివేసుకుంది. దుర్గారావు ఇదివరకు ఇద్దరికీ పరిచితుడు. కొన్నాళ్ళ క్రితం బదిలీయై వైజాగ్ వెళ్ళిపోయాడు! ఏదో పని తగిలిందట. అందుకని ఈ ఊరొచ్చాడు. మరల. నీ గురించి మరీ మరీ అడిగేడు! దుర్గారావుని అలాగ నిరాకరించడంతో నువ్వు పెద్ద తప్పు చేశావేమో అని నా కనిపిస్తుంది సీతా అవకాశం ఎప్పుడూ మన అందుబాటులో ఉండదు.

సీత మౌనంగావింటూ వుండిపోయింది. మనసు ఆందోళితమయింది. నోరు బిగుసుకు పోయింది, గుండెలుఎగసిపడ్డాయి.

"పాపం దుర్గారావు చాలా చిక్కిపోయాడు సీతా! గడ్డం పెంచేడు. కళ్ళు లోతుకు పోయేయి. అస్థిపంజరంలా అయ్యాడు. ఏమిటని అడిగాను, ఏంచెప్పడు, నవ్వి వూరుకుంటాడు కానీ నాకు తెల్సు సీతా! అతని మనస్సు చిత్రమయింది? నీకోసమే అతను అలాగ అయిపోయాడు." చెప్పుకుపోతుంది సుజాత.

సీత కనులు చెమ్మగిల్లాయి. సుజాత చూడకుండా కొనగోటితో కంటి చివర పోగయిన అశ్రుబిందువుల్ని తుడుచుకుంది.

"అసలు నువ్వలా ఎందుకు చేసేవన్నది, తలబ్రద్దలు కొట్టుకున్నా ఈ నాటికీ నాకు అర్థంకాదు. అతనికేం తక్కువని? అందం లేదా? సంస్కారం లేదా? ఆస్తి లేదా? చదువు, వుద్యోగం లేవా? అన్నీ ఉన్నాయిగదా? నీ పరిస్థితులన్నీ తెలుసుకున్నాడుగదా? నీ బరువు బాధ్యతల్ని తనూ సంతోషంగా పంచుకుంటా నన్నాడుగదా! మనసు విప్పి అన్నీ మాట్లాడేడుగదా! ఏమీ దాచకుండా హృదయాన్ని నీ ఎదుట పరచి పెట్టాడుగదా? నువ్వూ అంతావిని సంతోషంగా నే తలఎగరేస్తివి. అతను ఆ రోజు ఆనందంతో వూగిపోవటం నాకూ తెలుసు. నేనూ ఎంతో సంతోషించాను. ''నా స్నేహితురాలు సీత" ఎంతో అదృష్టవంతురాలు అని పొంగిపోయాను. అటువంటిది మర్నాటికల్లా నీ మనసు ఎందుకు మార్చుకున్నావు? ఇది నీ స్వవిషయమే అనుకో, నేను కల్గించుకోకూడదు. అయినా మనసున్న స్నేహితురాలిగా, నీ మంచినికోరి మాత్రమే నేను బాధపడుతున్నాను సీతా. చేతికందిన స్వర్గాన్ని నువ్వే కాలదన్నుకున్నావు. అదే నా బాధ ..."

సీత తన మొహాన్ని చేతుల్తో కప్పుకుంది.

మౌనంగానే రోదించింది.

సుజాత చెయ్యి ఆమెవీపుమీద ఆదరపూర్వకంగా కదలాడింది.

"పోన్లె మరచిపో సీతా! పూరుకో ఏమయినా అలా జరిగిపోయింది. ఏది ఎలా జరిగినా మనం మంచి స్నేహి తులం పరస్పర హితవుకోరుకునే వాళ్ళం. నా లక్ష్యం అదే పూరుకో. అతనికి నిన్ను చూడాలని గాఢమయిన కోరికవుందని నా కన్పించింది అది కేవలం అభిమానం ప్రేమ కలబోసి పెంచిన కోరిక మాత్రమే. ఒకవేళ అతను యాదృచ్ఛికంగా కలిసినట్లయితే కనీసపు స్నేహభావాన్నయినా వ్యక్తం చెయ్యి గతించిన అనుబంధాన్ని గురించ యినా మర్యాదని పాటించవలసిన ధర్మం అంటూ వుందిగా. ఇప్పుడు నీకు నేను చెప్పదల్చుకున్నదిఇంతవరకుమాత్రమే. కానీ ఒక విషయం నమ్ము. నేను నీ స్నేహితురాల్ని. నీ హితవుని మాత్రమే కోరేదాన్ని. అందుకోసం నా ప్రాణమైనా ఇవ్వటానికి సిద్ధపడతాను. నన్ను నమ్ము.

సీత హృదయం ద్రవించిపోయింది. ఆత్రంగా సుజాత నడుంచుట్టూ చెయ్యి పెనవేసి బిగించింది. ఏవో చెప్పాలని ప్రయత్నించింది.

కాని నోరు పెగిలి రాలేదు.

గుండెలు గుబగుబలాడాయి.

మనసు ఎగిరెగిరి పడింది.

మనసు పొరలలో బాధాతప్తమయిన మధురోహలు కదులాడాయి.

రిక్షా ఆగింది.

దిగేక డబ్బులిచ్చి రిక్షాను పంపే సింది సుజాతే!

"రా, సీతా!" అంటూ సీత చెయ్యి పుచ్చుకుని నడిపించింది సుజాత స్నేహ పిచ్చిలంగా.

గేటు తీసుకుని ఇద్దరూ లోపలికి వెళ్ళారు!

సుజాత గబగబా నడిచింది.

ఆమె వెనుకే అడుగులు వేసిన సీత కాళ్ళు అప్రయత్నంగా ఆగిపోయేయి. సీత ఆ క్షణాన తలెత్తింది. కళ్ళకు కన పడిన దృశ్యాన్ని చూసి, ఆమె గుండెలు ఝల్లుమన్నాయి ॥

## 2

"రా సీతా! రా!" అంటూ పిల్చింది సుజాత


ఎదురుగా వరండాలో కుర్చీలో కూర్చుని వున్న దుర్గారావు సీతనే చూస్తూ వున్నాడు. ఆ చూపులో స్నేహం వుంది, అభిమానం వుంది. ఈ రెంటినీ మించిన ఒక అనిర్వచనీయమైన భావనా వుంది.

సుజాతే వెనక్కి తిరిగివచ్చి సీతని చెయ్యిపట్టుకుని తీసుకొని పోయింది. కాళ్లు చేతులు కడుక్కొన్నాక ఇద్దరూ తిరిగి వరండాలోకి వచ్చారు.

"మీ రిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వుండండి. నేను ఇప్పుడే లోపలికి వెళ్ళి వస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది సుజాత.

"కూర్చోండి" ఆదరంగా అన్నాడు దుర్గారావు.

సీత కూర్చుంది.



"కులాసాగా వున్నారా?" అతనే అడిగాడు.

తల పైకీ కిందకీ ఆడించింది సీత.

"చిక్కిపోయినట్లున్నారు" అన్నాడు.

సీత పెదాలపైకి నవ్వు తెచ్చుకుంది.

"పనివుండి మరల నేను ఈ ఊరు రావలసి వచ్చింది. వచ్చాను, స్నేహితుల్ని కూడా చూశాను. నాకు చాలా సంతోషంగావుంది, సీతా!" అతనిగొంతు వణికింది.

తల దించుకుని అతని మాటలువింది సీత. సీత హృదయం తడబడుతూంది. పెదాలు అదురుతున్నాయి.

"మీరు బాగా చిక్కిపోయారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి" అని అందామనుకుంది సీత. కాని ఎంత ప్రయత్నించినా నోరు పెగలలేదు.

"మీవాళ్ళందరూ కులాసాగా వున్నారా సీతా?"

తలవూపింది సీత.

"మీ అన్నయ్య ఏంచదువుతున్నాడు. బి. ఎ. అనుకుంటాగదూ?"

అవునన్నట్లు తలవూపింది

"మీ చెల్లాయి కాలేజీలో చేరిందా?"

"ఊఁ."

"తమ్ముడు శశిధర్ చాకులాంటి కుర్రాడు. నైనయిందనుకుంటా."

"అవునండి" అనలేకోయి తల వూపి మాత్రమే సమాధానం చెప్పింది సీత.

"మీ అమ్మగారు, నాన్నగారు మంచి మనుషులు. ఎవరైనా ఎంత మంచి వారయినా పరిస్థితుల ఇనుప చట్రాల్లో నలిగిపోక తప్పదు త్వరలోనే మీ కుటుంబం కష్టాల్ని గట్టెక్కి సుఖాలరేవు చేరుకోవాలనే నేను ఎప్పుడూ కోరుకుంటూ వుంటాను. అప్పుడప్పుడు నన్ను జ్ఞాపకంచేసుకో సీతా! నీకు మంచి జరగాలి, అని కోరుకునే ఒక మిత్రునిగా నన్ను గుర్తువుంచుకుంటావు కదూ!"

సీత తలవంచింది. ఆమె కనులు అశ్రుపూరితా లయాయి.

"ఇటువంటి సమయాల్లోనే మనిషికి మనోధైర్యం అవసరం. ఆ ధైర్యమే మనిషిని బాధలనుంచి కడతేర్చగల సాధనం. త్వరలోనే మీ అన్నయ్య చదువు పూర్తయి, ఉద్యోగం వస్తుంది. అతను మీ కుటుంబానికి కొండంత అండగా అవుతాడు. మీ కష్టాలు తొలగిపోతాయి. అప్పుడు నువ్వూ మీ చెల్లాయి పెళ్ళికూతుళ్ళవ్వచ్చు. దేవుడు మేలుచేస్తే ఆ రోజు త్వరలోనే రావచ్చు అన్నట్లు నీ పెళ్ళికి నన్ను పిలుస్తావా సీతా? పిలిస్తే తప్పకుండా వస్తాను. ఈ అభాగ్య మిత్రుడ్ని మర్చిపోతేం?"

పమిటచెంగుతో ముఖం కప్పుకుంది సీత.

"ఛీ! తప్పు. అలా దుఃఖపడటం కూడదు. అందులో నీలాంటి అమ్మాయికి అది తగదు నిన్ను చూసి ఎప్పటికయినా నేను గర్విస్తాను నీవంటి స్నేహితురాల్ని కలిగి వున్నందుకు నా మనసు ఆనందంతో పొంగిపోతుంది. అదే నా గర్వానికి కారణం. ఏదీ మొహం తుడుచుకో సీతా. చీరప్!" అని నవ్వి నవ్వించాడు.

మూడు ప్లేట్లలో రవ్వలడ్లు, వేయించిన జీడిపప్పులు సర్ది ట్రేలో పెట్టుకుని వచ్చింది సుజాత.

'వాతావరణం గంభీరంగా వున్నట్లుంది నేను పానకంలో పుడకనవలేదు గదా!" అని నవ్వింది.

"ఆ మాటంటే నీ ముక్కునున్న పుడక ఒప్పుకోదు జాగ్రత్త" అని నవ్వాడు దుర్గారావు.

"ఒకరోజు వుండి వెళ్ళమంటే లేదు అర్జంటు పని వుంది, ఈ రోజే వెళ్ళాలంటున్నాడు." అందిసుజాత నెపం వేస్తూ. సీత తలెత్తి వుండమన్నట్లుగా అతన్ని చూసింది.

"లేదమ్మా. తప్పదు వెళ్ళిపోవాలి"

టీ తీసుకున్నాక థాంక్స్ చెప్పి లేచింది సీత. కాని మనసు వెనక్కి పీకుతూనే వుంది. ఇంకా అక్కడే కూర్చోవాలనే వుంది.

"సో" వుయార్ డిపార్టింగ్ థాంక్యు

డియర్ యంగ్ లేడీస్'' అంటూ, లేచి నిలబడ్డాడు, దుర్గారావు తనుకూడా.

నాలుగడుగులు వేసాక ఆగి వెను దిరిగి చూసింది సీత.

దుర్గారావు నవ్వి చెయ్యి వూపాడు.

సీతను గేటువరకువచ్చి సాగనం పింది సుజాత.

సీత, గుండెలు బరువుగా అయాయి. మనసు వూగిసలాడింది. ఆ సంచల నాన్ని నిగ్రహించుకోవాలని ప్రయ త్నిస్తూ గబగబ అడుగులువేసింది సీత.

ప్రొద్దుగూకింది. వీధుల్లో దీపాలు వెలిగాయి. షాపులు మెర్క్యురీ దీపాలతో ధగధగలాడుతున్నాయి. బజారులనిండా జనం కిక్కిరిసి ఉన్నారు. కాలేజీకుర్రాళ్లు సెంటర్లో పేపర్లకోసం ఎగబడ్తున్నారు. ఈవెనింగ్ ఎడిషన్ వచ్చినట్లు వుంది. రిజల్ట్సు బి ఎ. రిజల్ట్సు అంటూ పేపర్ల కుర్రాడు కేకలువేసుకుంటూ పోతు న్నాడు. అతన్ని ఆపి ఒక పేపరు కొన్నది సీత. అక్కడ్నే ఆగి రాజు రిజల్టుకోసం వెతికింది. రాజు నంబరు ముప్ఫయి సున్నా ఆరు. ఆ నంబరు ఎక్కడా లేదు. ఆత్రంగా ఒకటి రెండు సార్లు వెతికింది సీత.

ఆమె నవనాడులూ క్రుంగినట్లయింది.

రాజు పరీక్ష మరలా తన్నింది.

సీతని నీర్సం ఆవహించింది.

"సీతా !"

ఆ పిలుపుకు వెనుదిరిగి చూసింది సీత అప్పటికే రాజు దగ్గరకు వచ్చాడు.

"ఇంత ప్రొద్దుపోయి ఎక్కడినుంచి వస్తు న్నావు సీతా ?"

''ఇక్కడికేలే సుజాత దగ్గరికి వెళ్ళి వస్తున్నాను. నీ రిజల్ట్సు పడ్డాయి చూశావా ?"

''మైగాడ్ ! రిజల్ట్సుపడ్డాయా? అంత తొందరేమొచ్చిందని అప్పుడే వేశారు ! ఆ వేసినవాళ్ళకి బుద్ధిలేదు," అంటూ దగ్గరగా వచ్చాడు.

గుప్పున వాసనకొట్టింది. కడుపులో దేవినట్లయి మొహం తిప్పుకుంది, "ఊ. రిజల్టు పడ్డాయంటావు చూశావా ? ముప్ఫయిూ సున్నా ఆరేమయింది, బండెక్కిందా ?"

"పోయిందన్నయ్యా!" బాధగా అంది సీత.

రాజు పకపకనవ్వాడు. తెల్లబోయింది సీత.

"గురూ ! ఎవరా చిలుక ? కొత్తగా పట్టావేమిటి ?''

"ఛాప్, నోర్ముయ్యరా రాస్కెల్. మా చెల్లాయి. !"

"సారీ గురూ ! అలవాట్లో పొరపాటు

"సరేలే నోర్ముయ్యి. కాసేపు అవతల తగలడు.''

సీత నడవసాగింది. ఆమె ప్రక్కనే నడుస్తూ అన్నాడు రాజు.

"జాగ్రత్త చెల్లాయ్ ఈ మాట ముసలాళ్ళ చెవినిగాని వేసేవు. గుండె

పగిలి గొడవ చేయగలరు. చూద్దాం. ఈ వెధవ పరీక్ష ఇలా ఎన్నాళ్ళు తంతుందో చూద్దాం. అన్నట్టు సీతా, ఆ సంగతి ఏం చేసావ్ ?"

సీత ఆగి ఆతనివంక చూసింది. రాజు అసహనంగా మొహం పెట్టాడు.

"ఏమిటని గదూ నీ చూపు. ప్రొద్దుట చెప్పేను గదా ! డబ్బు కావాలి."

"చూస్తాను "

"ఎప్పటికి చూస్తావు ? ఈ చూట్టం తోనే నా ప్రాణాలు పోతున్నాయ్."

"అన్నాయ్ ! కష్టపడి ఇలా డబ్బు తగలెయ్యకపోతే ప్రాణాలు పోతాయా ? పరీక్షలూ తగలేసి డబ్బూ తగలేయ టానికి మనమేం లక్షాధికార్లమా ?"

''భిక్షాధికార్లమంటావు, అంతేగా. పోనీ అలాగే అనుకో. దేనికోదానికి అధికార్లమే గదా మరి !"

"అన్నయ్యా!"

"ఏమిటమ్మా నువ్వు మరీని."

"నాకు బాధగా వుందన్నయ్యా."

"పిచ్చిదానా, ఎందుకు బాధ పడటం ? అందులో ఏమయినా సుఖం వుందంటావా ? చెప్పు. అలా అయితే నేనూ బాధపడటం మొదలుపెడతాను."

"అమ్మ నీ మీద ఎన్ని ఆశలు పెట్టు కుని బ్రతుకుతూ వుంది ! ! నాన్న సంగతి నీకూ తెలుసు. అన్నీ తెలిసీ నువ్వుకూడా ఇలాగ తయారయితే ఈ సంసారం ఏమవను ? ఎలాగ కడ తేరను ?"

"అబ్బ ! ఏదన్నా అడిగితే నస పెడతావ్. అందుకే నువ్వంటే నాకు కోపం." అంటూ విసుక్కున్నాడు రాజు. సీత కొన్నిక్షణాలు మౌనంగా వుండి అంది.

"నేనంటే నాక్కూడా కోపంగా వుంది అన్నాయ్. ఏం చేద్దాం చెప్పు."

"ఏట్లో తగలడదాం పద" కోపంగా అన్నాడు రాజు.

"పద, నేను సిద్ధంగానే వున్నాను మరి !" అంది.

"సరేలే నోర్మయ్. బుద్ధిలేకపోతే సరి" అంటూ గిర్రున వెనుదిరిగి పోయాడు కోపంగా రాజు

సీత ఇల్లు చేరేసరికి సుబ్బమ్మ, రాఘవయ్య పీధరుగుమీద కూర్చుని వున్నారు. రాఘవయ్య చుట్ట తాగుతూ వున్నాడు.

"ఏమిటే అమ్మాయ్ ! ఇంత ప్రొద్దు పోయింది. మీ నాన్న వచ్చారు. పోనీ ఓపికతెచ్చుకుని ఇంత వుడకేద్దామని చూస్తే బియ్యం నిండుకున్నాయి. నువ్వు ఇలాగ చేస్తే ఎలా తల్లీ ? ఈ సంసారం ఎలా సాగేది ?" అంది సుబ్బమ్మ.

"పక్కింటి పిన్నిగార్ని అడిగి బదులు తీసుకోపోయావా ? అమ్మా" అంది సీత.



"ఏదీ, ఒకటే నీరసం, లేచి తిరిగి తేగా. నువ్వు త్వరగా వచ్చి ఆ పనేదో చూసుకుంటావనుకున్నాను. నాకేం తెలుసు ? నువ్వుకూడా రాణీగారిలా తిరిగి తిరిగి ఇప్పటిగ్గాని ఇల్లు చేరవని నేను కలగన్నానా ?"

"లలిత ఏమయింది ?"

"సినిమాకని ప్రాణాలుతీసి అది ఇప్పుడే పోయింది."

"దాన్ని సినిమాకి పంపించకుండా వుండాల్సిందమ్మా. ఇపుడు మనకి అవే తక్కువయ్యాయా ?"

"ఆ సంగతి నాకు తెలీదుటే తల్లీ, చిన్నపిల్ల ముచ్చటపడిందని సరే నన్నాను. అది తప్పే అయితే చెంపలు వేసుకుంటాను. నన్ను క్షమించు తల్లీ. నా బిడ్డలు ఎంత గొప్పవాళ్ళు ! చెట్టంత తండ్రినే ఎదురుగా పెట్టుకొని కన్న తల్లిని కూడా ఎంతలేసి మాటలయినా అనగర్లు ! శభాష్ అని నలుగురూ నన్ను మెచ్చుకుంటారు."

"ఇపుడు నేనేమన్నా నని అమ్మా అలా బాధపడ్తావు ?"

''పడద్దూ, ఇంకా ఎన్ని బాధలు

పడాలో ! ఇంకా ఎన్ని చూడాలో ! ఆ శ్రీరామచంద్రమూర్తికి దయ కలగద్దూ !''

"సర్లే, పోనీ. వూరోక్క అమ్మా. నాదే తప్పు, నన్ను క్షమించు.''

"వూరోక్క-వూరోక్క అని అందరూ నన్నేగా వూరోక్క పెట్టేవాళ్ళు" అంటూ గొణిగింది సుబ్బమ్మ. సీత లోపలికి వెళ్ళింది. దీపం వెలిగించింది.

''సుబ్బలక్ష్మీ, వూరోక్క రాదా" రాఘ వయ్య అనునయంగా నిర్దేశించాడు, భార్యని.

''వూరోక్క నేనేం చెయ్యగలనండీ. చూసారుగా, ఎంతెంత మాటలందో ? తిరిగి తిరిగి మగ మహారాజు అలిసి పోయి ఇంటికి వచ్చారు. ఏవేళననగా తిన్నారో ప్రేమగా ఇంత వుడకేసి నా చేతుల్తో పెట్టుకోవాలనేగా నా తాప త్రయం. ఆమాత్రం ఇంగితం, అభి మానం అందరికీ వుండి ఏడిస్తేగా ?"

కాళ్ళు చేతులు కడుక్కుని, మొహం తుడుచుకుంటూ సీత బయటికి వచ్చింది.

"అమ్మా, నా పెట్లో ఐదు రూపా యల కాగితం కనపట్టంలేదు. నువ్వు గాని తీసావా ? బియ్యానికి కావాలి.''

''చెప్పేను గాదే, లలిత కిచ్చానని."

"అలమార్లో రూపాయుండాలి ! ?"

"అదా ! ఇందాక మీ నాన్నగారు చుట్టలు కావాలంటేనూ శశికిచ్చి చుట్టలు తెప్పించాను."

సీత నిట్టూర్చింది.

"ఎందుకే తల్లీ, ఆ నిట్టూర్పులు. నట్టింట అలాగ నిట్టూర్పులు వదలటం మంచిదిగాదే. ఇప్పుడేం మునిగిపోయిం దని ! బయటికిపోయి ఏ అప్పో సప్పో తేరాదా ? మా కాలంలో మేమూ ఇట్లాగే చేసామూ ? జ్వరమొచ్చి మీ ముత్తవ్వ మంచమెక్కితే పదిమందిగల సంసా రాన్ని నేను ఎల్లా సంభాళించుకుని వొచ్చాను."

"సరేలే అమ్మా, నేను వెడు తున్నాను."

"త్వరగా రా అమ్మా, మళ్ళీ అందరూ వచ్చి అన్నాలో అని నా ప్రాణాలు తీస్తారు."

"అట్లాగే."

ఇరుగింటి ఇంద్రావతి వూళ్ళోలేదు. పురుటికని పుట్టింటి కెళ్ళింది.

ఆమె భర్త ఆనందరావు మంచివాడు కాదు.

ఆఫీసుకి వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు కిటికీ దగ్గరచేరి దొంగచూపులు చూస్తాడు.

అందుకని పొరుగింటి పున్నమ్మ దగ్గరికి వెళ్ళింది సీత. అవతలింట్లో అడిగి లేదనిపించుకున్నాక, అంతా విని పున్నమ్మ "అయ్యోతల్లీ,నెలాఖరురోజులు గదా. ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. అన్నట్లు నీకూ తెలుసుగా. ధరలు ఎలాగ మండిపోతున్నాయి. మీ బాబాయి

అక్కడికీ దెప్పుతారు. ఇల్లంతా ఆ రాఘవయ్య సంసారానికి అప్పులు ఇచ్చి దోచి పెట్టావు. నేనెక్కడ్నించి తెచ్చి చావను - అని. అన్నట్టు ఇదివరకు తీసుకున్నవి మానెడు బియ్యమూ, గిద్దెడు పసుపూ. కారమూ, మిరపకాయలూ, రవ్వా తీర్చాల్సిన అప్పు వుండిపోయాయి. వీలయినంత త్వరలో అవి తెచ్చి ఇవ్వు తల్లీ. మాదీ బండెడు సంసారం. నీకూ తెలుసుగా" అంటూ వుత్తచేతుల్తోనే సాగనంపింది పున్నమ్మ.

నీరసంగా వెనుదిరిగింది సీత.

ఆనందరావు అంతా వింటూ తోటలో పచార్లుచేస్తున్నాడు.

"ఏమండీ!"

సీత ఆగింది

"పాపం, అవసరముయి అప్పు కోసం తిరుగుతున్నట్లున్నారు నేను ఇస్తాను తీసుకెళ్ళండి" అన్నాడు గొంతు తగ్గించి.

"మరేం ఫరవాలేదు, రండి, రండి."

"వద్దు లెండి" అంది సీత.

"అయ్యో నా ఇల్లు బంగారంగాను. మనం మనుషులం కాదుటండీ! ఇరుగు పొరుగన్నాక ఒకరినొకరు ఆదుకోక పోతే ఎలాగ? ఉండండి. ఏం గావాలి? బియ్యమేనా? ఒక కిలో చాలా? ఆగండి వెళ్ళిపోకండి, తెస్తాను."

గబగబ లోపలికి వెళ్ళేడు ఆనందరావు. తుండుగుడ్డలో ఇన్ని బియ్యం మూటగట్టుకొచ్చి "ఇందండి" అన్నాడు.

తీసుకోవాలా వద్దా అన్నట్టు తటపటాయించింది సీత

"అబ్బ, మీరు త అనుమానం మనుషులండీ. నేనూ మనిషినేనండీ బాబు! మీ కష్టం నా కష్టంగాదా! మీ బాధ నా బాధకాదా? ఆమాత్రం అభిమానం లేకపోతే నేనెందుకు? నా బ్రతుకెందుకు? మనుషులన్నాక పరస్పరాభిమానాలు లేకపోతే ఎలా? అంతేనండి బాబు! ఇంద పట్టండి" అంటూ బియ్యం సీత వొడిలో పోసేడు ఆనందరావు.

పోస్తూ చేతికి చెయ్యి తగిలించాడు.

ఉలిక్కిపడింది సీత.

"అబ్బ! ఈవాళ నాకు చాల సంతోషంగా వుందండి బాబు. మీకు సహాయం చేసాను. మీ అభిమానాన్ని దోచుకున్నాను. ఆరే! వెళిపోతున్నారా?"

కళ్ళలో నీరు చిప్పిలగా గిర్రున వెనుదిరిగిండి, సీత

గబగబ ఇంటికి వచ్చింది.

పొయి రాజేసి ఎసరుపెట్టింది.

అన్నం దింపి దొడ్లోవి నాల్గు తోటకూరకాడలు కోసి కూరవండింది.

అరుగుమీదసుబ్బమ్మా, రాఘవయ్యా కబుర్లలోనే వున్నారింకా. రాఘవయ్య ఏదో చెపుతున్నాడు, సుబ్బమ్మ పకపకా నవ్వుతోంది.

"వంటయిందంటే అమ్మాయ్ ?"

"అయిందమ్మా."

"కూర ఏంచేసేవు?"

"నాలుగు తోటకూరకాడలు తరిగి వండేనమ్మా."

"అయ్యో నీ ఇల్లు బంగారంగాను. నాలుగు బంగాళాదుంపలు వుడకేసి వేపుకుని ఇంత చారు పెట్టుకోరదే ?"

"పెట్టుకుందాం, పెట్టుకుందాం. అరుగుమీదే కూర్చుని కాలు కదప కుండానే అన్నీ పెట్టుకుందాం"-శశిధర్ అప్పుడే బయట్నుంచి వస్తూ అన్నాడు. ఆ మాటలు విని,

"ఓరి కుర్రకుంకా ! ఎంతలేసి మాటలు నేర్చేవురా !"

"ఎంతయినా నీ కొడుకుని గాదమ్మా."

"చూసారా ! చూసారా ! ఎంత మాటలంటున్నాడో. దానిమీద ఈగని వాలనివ్వడు వేటకుక్కలాగ మీద పడ్తాడు. ఈ పిల్లల్ని, ఈ సంసారాన్ని చూస్తూ వుంటే గుండె చెరువవు తుందండి. ఆ శ్రీరామచంద్రమూర్తికి నా మీద..."

"దయ కలగలేదంటావు,అంతేనా?"

"సర్లేవోయ్ ! మాటలు నేర్చు కున్నావు" రాఘవయ్య మందలించాడు.

"అలాగేనండి నాన్నగారు ! మీరు ఎప్పుడు పచ్చేరు !"

"ఇప్పుడే లేవోయ్ !"

"కులాసాగా వున్నారా ?"

"సర్లే, నోర్ముయ్."


"నాలుగు రోజులుంటారా ? ఉండండి నాన్నగారూ. అమ్మ ఎంతో సంతోషిస్తుంది. మేమందరమూ సంతోషపడ తాము. ఉంటారుగదూ నాన్నగారూ ?"

"నోర్ముయ్యరా, పిచ్చి సన్యాసి" సుబ్బమ్మ హెచ్చరించింది.

"శశీ ! ఇలారా" అంటూ ఆదుర్దాగా పిల్చింది సీత.

అంతలోనే శశిధర్ చంప ఛెళ్ళున మ్రోగింది.

"కొట్టండి నాన్నగారూ ! కొట్టండి. మరేం ఫర్లేదు. పెట్టే చేతులు గాక పోయినా మా నాన్నవి కొట్టేచేతులు అనయినా సంతోషపడతాము. అమ్మ, అన్నయ్యమీద ఆశలు పెట్టుకుంది చిన్నక్క అంటే గారాబం ఆమెకి. వాడు ఆ ఆశలన్నీ వమ్ముచేసి ప్రతి సారి పరీక్ష ఫెయిలవుతున్నాడు. చదువు వంకన అదనీ ఇదనీ ఇంట్లో వాళ్లని పీడించి డబ్బు పట్టుకుపోయి జల్సాలు చెయ్యటంమాత్రం మాన లేదు. చిన్నక్క కాలేజిలోచేరి ఆ వంకన డబ్బుగుంజి తనూ తగలేస్తోంది. మీ గురించి నేను మాట్లాడనులెండి. ఇక ఈ సంసారం ఒడ్డెక్కటం అంటూ వుందా అని అమ్మకూడ ఆలోచించదు. అదే నా బాధ. అందరమూ కలిసి పెద్దక్కని ఇలాగా పీడించుకుని




తిండాం. కానీండి, ఎన్నాళ్ళు ఇలాగ సాగుతుందో చూద్దాం మరి. మీరు కొట్టే రని నాకేం బాధలేదు నాన్నగారూ! ఇప్పుడు నాకెంతో హాయిగా వుంది"

"నర్లే నోర్ముయ్! వెధవా" రాఘవయ్య ఘర్జించాడు.

శశిధర్‌ని రెక్కపట్టుకొని లోపలికి ఈడ్చుకుపోయింది సీత.

"వేలెడు లేడు వెధవ! ఎంత పెద్ద మాటలన్నాడే!"

"అవును, సిసింద్రీ వెధవ అంతా తాత పోలిక."

"అవునవును."

"మా నాన్నకూడా ఇలాగే..."

"సర్సర్లే, మీ నాన్నకి నోట్లో నాలికేది? కాని మా నాన్న ఇలాగే వుండే వాడని అమ్మ అంటూ వుండేది."

"సంబడం భాగానే వుంది."

"అవునుగాని సుబ్బదూ! వాడు అన్న మాటల్లో నిజం లేదంటావా? ఎన్ని మాటలు నేర్చేడు. ఎంత ధైర్యంగా వదిలేడు!"

"వాడూ పెద్దవాడవుతున్నాడు. పద్దెనిమిదేళ్ళరాలా? మీరు వుండుండి ఇల్లు వదిలిపెట్టి పోవటం మొదలెట్టినప్పు దేగా వాడు పుట్టింది. నాకు లెక్కే. పద్దెనిమిది నిండింది" అంది. రాఘవయ్య మొహం కందిపోయింది

"సరేలే. అవునే నీ గోలే నీదిగాని ఈ సంసారం ఎలా ఒడ్డున పడెయ్యాలా అన్న ఆలోచన నీకు లేదని వాడన్నాడు గదా! అది నిజం గాదంటావా?" అప్రయత్నంగానే అడిగేడు రాఘవయ్య. సుబ్బమ్మ సర్రున లేచింది.

"నా సంగతలా వుంచండి. మీకు ఈ సంసారం గురించి ఏం పట్టింది

నాకు కాస్త చెప్పండి. ఇద్దరు కూతుళ్ళు పెళ్ళికెదిగి వచ్చి కూర్చున్నారు. కుర్రాళ్లు ఆలాగ అవుతున్నారు. ఇల్లు తనఖా పెట్టిరి ఏనాడూ కష్టపడి సంపాదించి ఒక రూపాయ తెచ్చి ఇంట్లో ఇవ్వటం తెలియదు. ఏం మనుషులు ? ఆ దేముడి దయవల్ల ఆ పెద్దది, చిన్నదో పెద్దదో ఒక వుద్యోగం సంపాదించి, కష్టపడి ఈ సంసారాన్ని లాక్కువస్తూ వుందిగాని లేకపోతే ఏమయేటట్టు ? రోజులు ఎలాగ వున్నాయి ? ఇలాగ ఎన్నాళ్లు సాగేటట్టు ? ఇక బాధ్యతల్ని ఎప్పటికి మీరు పట్టించుకొనేటట్టు... ," కడుపులోని బాధ అంతా ఆ రూపాన వెళ్లగ్రక్కింది సుబ్బమ్మ.

రాఘవయ్య ఏవ్వన లేచేడు; కోపం పొంగి వచ్చింది పట్టరాని ఆవేశంతో 'ఛీ' అన్నాడు. 'నీ మొహం చూడటం పాపం! తప్పంతా నాదే. అభిమానం కొద్దీ వస్తే మొగాడన్న విచక్షణన్నా లేకుండా తగిన శాస్తి చేసావు. ఎన్ని మాటలన్నావు ? చిన్న పెద్ద లేక పిల్లలచేత కూడ నన్ను ఎంత మాటలనిపించావ్ ! ఇక ఒక క్షణం నేను వుండను,'' అంటూ పైపంచ దులిపి భుజాన వేసుకన్నాడు.

'అయ్యో ! అయ్యో ! అదేమిటండి. ఏదో కష్టం సుఖం మాట్లాడబోయాను. అంతేనండీ. ఉండండి,' అంటూ బతిమాలింది సుబ్బమ్మ. కాని రాఘవయ్య ఆగలేదు.

అప్పుడే సీత బయటికి వచ్చింది.

''అమ్మా నాన్నగారు ఏరి ? అన్నం వడ్డించనా ?''

"ఏమీ వద్దుగాని ఆ శశిగాడేడి ?"

"ఏడ్చి ఏడ్చి ఇప్పుడే నిద్ర పోయాడు. అలిగి అన్నం మానేసాడు. ఎంత బతిమాలినా వినలేదు. పాపం ! ఆకలితోనే నిద్రపోయాడమ్మా, తమ్ముడు !"

"తినకపోతే పోయాడులే ! చావమను ! అందరూ చావండి. నా ఖర్మ ఆ శ్రీరామచంద్రమూర్తికి నామీద దయలేదు "

"అమ్మా !"

"వాడికి వాడు మాత్రం ! వెధవ. వేలెడు లేడు ! తండ్రిని పట్టుకుని అంత మాటలన్నాడు !"

"అమ్మా శశి ఇంకా చిన్నవాడు కాదు. పెద్దవాడవుతున్నాడు. వాడికి వూహ తెలిసొస్తోందమ్మా."

"తెలిస్తే తెల్సిరానీ. ఇన్నాళ్ళకి దయ గలిగి ఆ మహారాజు ఇంటికి వస్తే ఆయన్ని అట్లా మాటలతో పొడిచి వెళ్ళ గొట్టాడా ?"

"నాన్న వెళ్లిపోయారా, అమ్మా ! ఏం జరిగిందసలు ?" దిగాలుగా అడిగింది సీత.

"ఎవరికయినా ఇంతకన్నా ఏం



జరగాలి తల్లీ. పౌరుషం వున్న మగ మనిషి మాట పడతారా!! ఆ బుద్ధి అనేవాళ్ళకుండాలి. అదే ఈ ఇంట్లో వుండే మనుషులకి లేనప్పుడు ఆయన ఒక క్షణం మాత్రం ఇంట్లో ఎందుకు వుంటాడు. నావల్ల కాదు ఈ సంసారం ఈదటం ఇక నావలనకాదు మీరూ మీరూ ఏమయిపోతారో అయిపోండి. కృష్ణారామా అని ముక్కు మూసుకుని కళ్ళు మూసుకుని ఆ రాముడికి నామీద దయ కలిగేదాకా పడివుంటాను." అంటూ లోపలికి వెళ్ళింది సుబ్బమ్మ విసురుగా.

బాగా ప్రొద్దు గూకింది.

బజార్లు పల్చబడ్డాయి.

అప్పుడో ఇప్పుడో ఒకటీ అరా రిక్షా గంట మోగించుకొంటు వీధిన వెళ్తు వున్నది.

ఉన్నట్టుండి, ఒక్కసారిగా సంచలనం మొదలయింది.

మొదటాట వదిలిపెట్టినట్లున్నారు.

జనం గుంపులు గుంపులుగ కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారు. రిక్షాలు గంటలు మోగించుకుంటూ జనం మధ్య నించి దూసుకుపోతున్నాయి.

వరండా స్తంభాన్నానుకొని నిల్చుండి పోయింది సీత.

మల్లెపూలు పెట్టుకొన్న అమ్మాయిలు మొగుళ్ళతో సినిమా చూసి వాళ్ళు చెప్తున్న మాటలు వింటూ హుషారుగా ఇళ్ళకి వెళ్తున్నారు.

సీతకి దుర్గారావు తలపుకి వచ్చేడు.

అతని మాట వింటే ఈ పాటికి తనూ అలాగే అతన్తో కలిసి సంతోషంగా సినిమాలు చూస్తూ వుండాల్సింది. అతని బ్రతుకులో ఆనందం నింపి తన బ్రతుకులో సంతోషం పండించుకుంటూ వుండాల్సింది.

కాని తనే నిరాకరించింది.

ఇష్టంలేక కాదు. కష్టమనీ కాదు.

అతను అంతా వివరంగా చెప్పాడు. ఈ కుటుంబ భారాన్ని తనకోసమే 'తనూ' సంతోషంగా మోస్తానన్నాడు. పరిస్థితులు అతనికీ తెలుసు. తెలిసే 'తన' కోసం త్యాగం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

కాని ప్రేమ సానుభూతిని సహించ లేదు. సహించినా అది తన స్థాయిని నిలబెట్టుకోలేదు- కాలక్రమాన అది నిర్వీర్యమైపోతుంది బ్రతుకులోని సగ్న సత్యాల్ని, యాదార్థ్యాల్ని ఎదుర్కొన లేక పేలవమై గుణహీనమై అసహ్యంగా మారిపోయే ప్రమాదముంది.

కారణం ఏమయినా అలాగ జరిగి పోయింది కావాలని చేసింది కాదు. తప్పక అలా జరిగింది. గాని మర్చిపోవటం అంత సులభంగాదు అతని విషయంలో అది స్పష్టమయింది. తను మాత్రం,

సస్యశ్యామలమయిన పచ్చిక బయళ్ళు, పంట పొలాల వయిపు గాక. నిరామయమయిన ఎడారుల వెంట జీవితాన్ని పరుగులెత్తించింది సుఖం కోసం మాత్రం కాదు. ఒక సంతృప్తిని ఆశించి అలాగున చేయవలసి వచ్చింది. బాధ్యతలు నెరవేరి అనుకున్నది సాధించిన క్షణానే ఆ సంతృప్తి లభించేది. అదీ ఎడారిలో ఎండమావి లాగున తన చేత పరుగులు పెట్టిస్తూనే వుంది గాని అందే సూచనలున్నా కను చూపుమేరలో కాన రావటంలేదు.

తన ప్రేమకోసం అర్రులు చాచిన దుర్గారావు దురదృష్టవంతుడు. కాదు కాదు తనే దురదృష్టవంతురాలు. ఆ దురదృష్టమే అతన్ని తగుల్కొన్నది

సీత కనులు నిండేయి

కన్నీరు కారి చంపలమీద చారికలు కట్టాయి.

కొన్ని గుండెలు శిలాసదృశంగా వుంటాయి. ఆ శిలయినా ఒకొకప్పుడు కరిగిపోయే అవకాశమూవుంది. ఆ క్షణాన

సీత గుండెలు అటువంటి పరిస్థితిలో వున్నాయి.

వీధిలో 'ఛయ్యి' మంది.

సీత ఉలికిపడి కనులు, బుగ్గలు తుడుచుకుంది.

వీధిలో వెడుతూవున్న టాక్సీవాడు రిక్షావాడ్ని ప్రక్కకి తప్పుకోమని హెచ్చరించటానికి, క్లచ్చూ, యాక్సిలరేటరూ గట్టిగా తొక్కి ఆ చప్పుడు సృష్టించాడు.

సినిమా జనం కలకలం తగ్గింది.

వీధులు పల్చబడ్డాయి. చలిగాలి మొదలయింది.

మున్సిపాల్టీ వీధి దీపాలు గుడ్డిగా వెల్గుతున్నాయి.

"నాన్నా! కొట్టండి నాన్నా. మరేం ఫర్లేదు" నిద్రలో శశిధర్ కలవరించాడు.

గబగబ లోపలికి వెళ్ళింది సీత.

"బాబూ! శశీ!"

శశిధర్ మరల నిద్రలోకి జారుకున్నాడు.

"శశీ! శశీ!"

శశి మాట్లాడలేదు. దుప్పటి సరిగ్గా కప్పి శశిని ప్రక్కకి తిప్పి పడుకోపెట్టి మరల వీధి వరండాలోకి వచ్చింది సీత.

వొంట్లో నీరసంగా వుంది. నరాలు లాగుతున్నాయి.

స్తంభాన్నానుకుని అలాగే నిలబడింది సీత. సీత కన్నులు ఎదురు తెన్నులు చూస్తున్నాయి. చీకట్లోకే చూస్తూ కాసేపు వుండిపోయింది, సీత.

అప్పుడే బరబరమని చప్పుడు చేసుకుంటూ వచ్చి ఆగింది. ఒక స్కూటరు. ఆనందరావు ఇంటిదగ్గర ఆగిన స్కూటరు లైట్లు ఆరిపోయేయి.

కళ్ళు చించుకుని చూసింది సీత!

సీత గుండెలు ఝల్లుమన్నాయి

సీత నరాలు గజగజ వణికేయి!

మనసు తల్లడిల్లింది!

(సశేషం)



# నిశ్చయం

పాలడుగు వెంకటేశ్వరరావు



(గత సంచిక తరువాయి)

## 3

స్కూటరుమీద ఒక యువకుడు కూర్చుని వున్నాడు స్టయిలుగా బట్టలు వేసుకుని "నెక్ టై" కట్టుకున్నాడు కొత్తయిన క్రాపుని పైకి ఎగదువ్వి వున్నాడు

స్కూటరు వెనక సీటునుంచి ఒక యువతి దిగింది, వయ్యారంగా దిగి మొహంమీది చిరుచెమటని కర్చీఫ్‌తో అద్దుకుంది.

"సో, థాంక్యూ డియర్" అన్నాడు అతడు

"థాంక్యూ సోమచ్ గుడ్‌నైట్"

"అప్పుడే! ఏదీ నా చివరి బహుమానం .."

"అమ్మో...ఆశే..."

"చాల దారుణం డియర్", బ్రతిమాలాడు

"తప్పదు మరి. ఇది బజారు"

"మరి రేపు అదే టయిముకి..."

"అలాగే"

ఆ యువకుడు గాలిలోకి ఒక ముద్దుని వదిలాడు ఆమె నవ్వుతూ తుళ్లుతూ అడుగులు వేసింది స్కూటరు స్టార్టయి వెనక్కి తిరిగి చూసుకు పోయింది

గిర్రున వెనుదిరిగి లోపలికి వెళ్ళింది సీత

ఆమె కాళ్ళ వణుకు ఇంకా తగ్గక ముందే లలిత వచ్చింది

"అక్కా, ఇంకా నిద్రపోలేదా ?"

"లేదు లలితా ! అన్నం పెట్టనా ?"

"అబ్బ పెట్టుతల్లీ, ఇది కూడా అడగాలా ఆకలేస్తూ వుంది"

"అలాగే, కాళ్లు కడుక్కొని రా"

క్షణాల్లో కాళ్ళు కడుక్కొని వచ్చింది లలిత పీటమీద కూర్చుని గబగబ అన్నం తింటూవున్న లలితనే చూస్తూ వుండిపోయింది సీత

కాసేపయాక తలెత్తి చూసింది లలిత అక్క చూపు ఆ పిల్లలో గాభరా కలిగించింది ఆ గాభరా అణచుకొని "ఏమిటలా చూస్తున్నావ్ ?" అని అడిగింది లలిత

"ఏంలేదు, సినిమా ఎట్లా వుంది ?"

"సినిమాకేం ? వండర్‌ఫుల్‌గా వుంది"

"ఒక సంగతి చెబుతాను లలితా, వింటావా ?" అంది సీత కొన్ని క్షణాలు గడిచాక. "ఓ" అంది లలిత తల వంచుకుని.

"చెల్లీ ! సినిమాలు చూట్టానికే బాగుంటాయి కాని బ్రతుకుల్ని సినిమాల్లాగ చేసుకుంటే భరించటం చాల కష్టం లలితా ! సినిమా చూసి కన్నీరు కార్చిన మనిషే వాస్తవ జీవితంలో ఎదురయిన అటువంటి సంఘటననే క్షమించి వదిలిపెట్టలేదు—కాకిలాగ పొడవకా మానదు. అది నువ్వు గమనించావా ?"

"ఏమిటక్కా సినిమా డైలాగు పడుతున్నావ్ ? ఏమయింది ?"

"మనం ఆడపిల్లలం లలితా. అందునా ఆర్థికంగా చితికిపోయిన కుటుంబం మనది ఇవన్నీ ఆలోచించి జాగ్రత్తపడమంటున్నాను" అంది సీత

"అక్కా ! నువ్వూ నీ ముది మాటలూను అందుకే నువ్వంటే నాకు కోపం" అంటూ బుంగమూతి పెట్టింది లలిత

"పిచ్చి తల్లీ, నీ బాగుకోసమే నమ్మా నా ప్రయత్నం అపార్థం చేసుకో కోపంవద్దు"

"సర్లేమ్మా, పెద్ద ! అవునుగానక్కా, నేనడిగింది ఏంచేసావు?"

"ఏమిటది ?"

"అదుగో మళ్ళీ మొదలన్నమాట ! పార్టీకి డబ్బులు ఇస్తానన్నావు గదమ్మా"

"సరేలే, చూద్దాంలే"

"చూద్దామంటే గాదు, అవతల పరువుపోతుంది. మాట ఇచ్చాను"

"పరువు పోతుందనుకున్నప్పుడు మాట ఎందుకిచ్చావు ?"

"అబ్బ ! మళ్ళీ మొదలు"

"సరేలే"

"రేపు సాయంత్రానికల్లా ఇవ్వాలి మరి! మా అక్క మంచిదిగా!'' అంటూ చెయ్యికడుక్కొని లేచిపోయింది లలిత

కంచంతీసి, ఎంగిలి ఎత్తి అవతల పెట్టింది సీత

గదిలోంచి కూనిరాగాలు వినవస్తున్నాయి ఆ గొంతు లలితది సీత ప్రేగులు ఆకలితో అరిచాయి అన్నం తినాలనిపించింది అంతలోనే సీత మనసు వెనక్కి లాగింది వీధితలుపులు వేసివచ్చి పడుకుంది సీత

"అక్కా! నువ్వు తిన్నావా? నువ్వు పెట్టుకో వేళకి నువ్వు తినెయ్యక ఎందుకమ్మా నాకోసం కూచోటం? సరేలే రా ఇద్దరం కలిసి తిందాం" అని లలిత అని వుంటే సీత తినేదేమోగాని - లలిత ఆ మాట అనలేదు ఆకలి, తినాలన్నా మనసు తిననీయలేదు

నాన్న చాలరోజుల తరవాత ఇంటికి వచ్చారు

అమ్మ ఎంతో సంబరపడి హడావుడి చేసింది.

కాని అంతలోనే అలాగున అయిపోయింది నాన్న కోపగించి వెళ్ళిపోయారు అమ్మ దుఃఖంతో అన్నం మానేసి పడుకుంది (సుబ్బమ్మ ఇంకా మంచంలో కదుల్తూనే వుంది) శశిధర్ దెబ్బలుతిని ఏడ్చి నిరాహారంగానే నిద్రపోయాడు

రాజు పరీక్ష మరలా పోయింది! ఆ విచారం వాడికి లేదుగదా, పైపెచ్చు వాడు జల్సా చేస్తున్నాడు

తాగుతున్నాడు! చీకు చింత లేక తిరుగుతున్నాడు!

పులిమీద పుట్రలాగ లలిత మొదలెట్టిన పిచ్చి తిరుగుళ్లు ఈ రోజే తన కంటబడటం జరిగింది!

లలిత అమాయకురాలు

తనకి రేపు ఏమయినా మోసం జరిగితే!

ఏమిటి ఇదంతా!

ఎందుకు ఇలాగ జరుగుతూ వుంది?

ఈ కుటుంబం ఏమవుతుందో? నడి సముద్రంలో గాలివాటున కొట్టుకుపోతున్న ఈ పడవని తుఫాను ముంచెయ్యదుగదా!

ముంచెయ్యటమే జరిగితే?

అమ్మో!

ఏ దారీ తోచదు దట్టమైన అడివిలాంటి బ్రతుకులో బలమయిన బంధనాలు వేసే తీగల్లాంటి సమస్యలు!

వంటగది సర్ది, వీధి తలుపువేసి వచ్చింది సీత ఇన్ని మంచినీళ్లు త్రాగి దీపం తగ్గించి మంచంమీద నడుము వాల్చింది

చాలసేపటివరకు నిద్రపట్టలేదు

కనులు మూతలు పడలేదు

మనసు కల్లోలితమయింది గాలి తూపుకి అల్లలాడి కొండెక్కబోయిన దీపం మరల ప్రాణం నిల్పుకుంది; వెల్గులు వెదజల్లసాగింది

ఉస్సురని నిట్టూర్చింది, సీత బాగా ప్రొద్దుపోయింది సీత అలసిన కనులు ఏదో ఒక క్షణాన అరమూతలు పడ్డాయి

"టక్...టక్...టక్..."

సీతకి మెలకువ వచ్చింది "ఎవరూ ?" అంటూ పిల్చింది, జవాబు లేదు ఎవరూ లేరు, తనే పొరపాటు పడ్డాననుకుని ప్రక్కకు తిరిగి పడు కుంది సీత.

"టక్...టక్...టక్" వీధి తలుపు మీద చిన్నగా మోత

సీత వులికిపడి లేచింది, "ఎవరది ? ఎవరంటే మాట్లాడరేం?" అంది సమా ధానం లేదుగాని మరల తలుపుమీద చప్పుడయింది బహుశా రాజు అయి వుండాలి ఇటువంటి పనులు అతనికి అలవాటే

తలుపు తీసింది సీత

ఎదురుగా చీకట్లో ఒక పురుషాకారం నిలబడివుంది !

"రాజూ !"

"కాదు, నేనండి, బాబు "

"నేనంటే ?"

"ఒకసారి ఇలారండి బాబు! మీతో పనిబడింది మాటుంది" ఆనందరావు గుసగుసగా అన్నాడు

"ఏమిటా పని ?"

"అదేమిటండి బాబు ! మా ఇంట్లోకి పాము వచ్చింది, రండి దాని పని పడ దాము త్వరగా రండి మరి !"

"బాగుందండి, నన్నేం చెయ్య మంటారు ?" అంది సీత ఆశ్చర్యంగా

"భలేగా వుందండి బాబు! మంచి కయినా, చెడుకయినా తోడుకావాలండి మరి రండి అసలే చలికి వణికిపోతు న్నాను మీకేం హాయిగా లోపలుండి మాట్లాడుతున్నారు నేను బయటున్నాను గద !"

"ఆనందరావుగారూ ! ఇది మర్యాద గాదు ఎవరయినా చూస్తే బాగుందదు ! దయచేసి వెళ్ళిపొండి "


"అరే ! అదేంటండి ? రండి బాబు అని నేనంటుంటే పొండని మీరంటారు?! నేను ఒంటరివాణ్ణి, అవతల పాముపచ్చే! అవునా ?"

"ఈసరికి దాని దార్ని అది పోయుంటుందిగాని మీరు వెళ్ళండి "

'నేను వెళ్లను గాక వెళ్లను మీరు వచ్చేవరకు ఇక్కడనే వుంటా "

"షటప్!"

"అదేంటండి బాబు ! అంత మాటం టారు ! ఇరుగు పొరుగన్నాక కాస్తయిన అభిమానం వుండాలి ఒకరి కొకరు సాయం చేసుకోవాలి పో పొమ్మని




అలాగ అంటే నేను ఒక్కణ్ణి ఆ పాముతో ఎలా చచ్చేది?'

"ఎక్కడుంది ఆ పాము ? మీ ఇంట్లోనా ? లేక మీ మనసులోనా ?"

"పోనీ నా మనసులోనే అనుకోండి భలేవారండి బాబు ! రండి మరి. ఎవరూ చూడరు లెండి అందరూ నిద్దళ్ళలో వున్నారు వెధవది ఆ పాము గొడవతో నాకు చచ్చినా నిద్రపట్టటం లేదు "

"నోర్మూసుకొని వెళ్ళిపొండి. ఇంకొకసారి ఇలాగ చేసేరంటే మర్యాద దక్కదు, జాగ్రత్త పిచ్చి వేషాలు వెయ్యకండి "

"భలేవారండి బాబు ! ఎంత కోపం ! మీ కోపంకూడా అందంగానే వుంటుందండి" అంటూ లోపలికి రాబోయాడు ఆనందరావు.

ఠళ్లున అతని మొహంమీదే తలుపు వేసింది సీత గడియపెట్టి వచ్చి మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

పున్నమ్మ గారింట్లోంచి తొలి కోడి కూసింది

సీతకి ఇక నిద్రపట్టలేదు

చీకట్లోనే లేచి వాకిలి వూడుస్తుంటే రెండు కాళ్లు వచ్చి సీతదగ్గర నిలబడ్డాయి. వాటిని గమనించి తలెత్తి చూసింది సీత. రాజు నిలబడి వున్నాడు ఎదురుగ.

"అన్నాయ్ !"

"నే నే సీతా !"

కాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"ఎవరూ యింకా నిద్రలేవలేదు గదా !"

"ఊహూ "

"గుడ్ నేను వెళ్ళి పడుకుంటాను.

నా అంత నేను లేచేవరకూ నిద్ర లేపకు !"

"అలాగే !"

"అన్నట్టు నిన్నటి సంగతి ఎవరికీ చెప్పలేదుగదా ?"

"వద్దన్నావుగదా !"

''మా చెల్లాయ్ మంచిది " అంటూ గబగబ లోపలికి వెళ్ళిపోయాడు రాజు. ఉదయం లేవగానే సుబ్బమ్మగారు గొడవ పెట్టుకుంది. రాజును లేపి బెడ్ కాఫీ ఇమ్మని పదే పదే చెప్పింది ఆ మాటని సీత పాటించలేదని గొడవచేసింది

"ఈ ఇంట్లో నా మాటని ఎవరుపట్టించు కుంటారు ! అద్దాలనాడే బిడ్డలుగానీ గడ్డాలనాడు కాదుగదా ! ఒక పెద్దా, చిన్నా లేదు ఏంపిల్లలు? ఏంసంసారం? ఇక నావల్ల కాదు తల్లీ! అందరూ పోయి ఏ గంగలోనన్నా కలవండి...'' అంటూ గొణుగుతూనేవుంది, ఆ గొణు గుడు విని విని తలపట్టుకుని, ఇక నోరు మూసుకో తల్లీ!' అంటూ హెచ్చరిం చింది లలిత

"మూసుకుంటానే మూసుకోక ఏం చెయ్యను ?" అని కోపంలో మంచం ఎక్కి ముసుగు తన్నింది సుబ్బమ్మ నోరుమూసుకుని

ఇంటిపనన్నీ ముగించి శశిని స్కూల్ కు పంపించి ఆఫీసుకు వెళ్ళింది త్వరగానే సీత, సీతనిచూసి కళ్లెగరేసాడు మాణిక్యరావు ఇంకా ఆఫీసుకెవరూ రాలేదు," సీతా! ఒకసారి ఇలా వస్తావు!" అన్నాడు మానిక్యరావు


"యస్సర్," అంటూ అతన్ననుస రించింది సీత,

ఇంకా ఎవరూ రాలేదు సుజాతకూడ రాలేదు. ఆఫీసు వెనకాల చెట్టుదగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు మానిక్యరావు. అతని వెనకే వెళ్ళి కాస్త దూరంలో నిలబడింది సీత

"సీతో ఒకమాట చెప్పాలని ఎన్నాళ్ళ నుండో అనుకుంటున్నాను ఈవేళ్టికి ఆ అవకాశం వచ్చింది ఆ మాట ఏదో చెప్పి నా మనసులోని గుడగుడని తగ్గించు కుంటాను," అని ఆగేడు

"చెప్పండి !"

''నిజం చెప్పద్దూ ! నేను అలా ఏదో వాగుతూ వుంటాను గాని నా మనసు మంచిదే నా వయసా పెద్ద ముంచు కొనివచ్చిందిలేదు నన్ను అన్యాయంచేసి నా భార్య వెళ్ళిపోయింది కుర్రనాగ మ్మలు ఇద్దరూ ఆలనా పాలనా చూసే వాళ్ళులేక పిచ్చివాళ్ళల్లాగ తిరుగు తున్నారు అందుకని "నీకేం తక్కు వయ్యా, ఇంకో పెళ్ళిచేసుకోరాదా ! అటు పిల్లల్ని చూసుకునేందుకు తల్లీ, ఇటు ఇల్లుదిద్దేందుకు ఇల్లాలూ అవసరం గద! అసలు ఆడది దీపం పెట్టని ఇల్లు ఏఇల్లు ?" అని తెల్సినవాళ్ళు చెవుల్లో పోరి నా మనసు విరిచేసారు ఏవో సంబంధాలు వస్తున్నాయనుకో అయితే



సంసారమన్నాక మనసులు కలవాలిగదా ఆ వచ్చేది మొదటి భార్యలాంటిదే అయి ఇల్లు దద్దాయాగం చేసేదయితే తల నొప్పి కొనితెచ్చుకున్నట్టు అవుతుంది మరి ఆ పైన ఆ పిల్లలుండిరి... !"

"ఇదంతా నాకెందుకు చెప్తారుసార్ ?" అంది సీత.

మాణిక్యరావు నవ్వాడు "వస్తున్నా పాయింట్ కే వస్తున్నా ఆగుమరి, రాత్రి మీ నాన్న మా యింటికి వచ్చాడు."

''నాన్న వచ్చారా ?!''

"ఆఁ రాత్రి అక్కడే ఉన్నాడు ఇప్పుడూ అక్కడే వున్నాడు చిరకాల స్నేహితం వలన ఇద్దరం రాత్రంతా నిద్ర మాని మంచి చెడు చెప్పుకున్నాము మన సులు విప్పి కష్ట సుఖాలు ముచ్చటించు కున్నాము "

''అలాగా ?!''

"ఆఁ మేం. చివరికి ఓ నిర్ణయానికి

వచ్చాము. ఆ నిర్ణయం తెల్పటానికే నిన్ను ఇప్పుడు పిలున్త !"

"చెప్పండి మరి."

"మీ అన్న రాజు అలాగ బాధ్యత పట్టకుండా తిరుగుతున్నాడు! నీ పెళ్ళి విషయం పోనీలే అనుకున్నా లలిత బాధ్యత వుండనేవుంది తర్వాత శశిధర్ వున్నాడు కుటుంబం అలాగ అయో మయమయిన పరిస్థితిలో వుంది ఇదంతా చెప్పి ఎంతో బాధపడ్డాడు మీ నాన్న. పాపం ఎంత గుండెధైర్యంవున్నా ఆ పరి స్థితిలో ఎవరయినా అంతేగదా !"

సీత కళ్లు తడి అయాయి

"ఒకవేళ రేపు ఎవరయినా నిన్ను కట్టుకోటానికి సిద్ధపడినా అది నీ సంపా దన కోసమేగాని అభిమానంతో గాదనేది పచ్చినిజం అటువంటప్పుడు అతడు ఈ సంసార బాధ్యతని నెత్తిన వేసుకుం టాడా అన్నదీ అనుమానాస్పదమే. ఒక వేళ ఆ వూపులో అందుకు సిద్ధపడినా ఆ తర్వాత అతడు మాటచెల్లించుకుంటా డన్న నమ్మకం ఏమిటి ? ఇవన్నీ ఆలో చించి ఎంతో ఆందోళన చెందాడు మీ నాన్న ..."

సీత మౌనంగా వింటూ వుండి పోయింది

"నిజంగా సీతా! ఆయనకంటే నువ్వే ఎంతో ధైర్యస్తురాలివి, నాకు నువ్వే నచ్చావు. అందుకని నేను ఆయనకి మాట ఇచ్చానులే ఎంతో ఆలోచించి చివరికి ఇది ఉభయతారకంగ వుంటుందనిపించి ఆ నిర్ణయానికి వచ్చాము. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను మీ కుటుంబాన్ని ఆదుకుంటాను నీ కయినా అంతకంటే ఏంకావాలి ! అవునా !"

అవును కాదని ఏందెప్పలేకపోయింది సీత

"నీ ఇష్టం మరి మీ నాన్నయితే మాట ఇచ్చాడు ఆయనసలే మొండిమనిషి. కాదని అల్లరిపడి ఆయన్తో గొడవ పెట్టుకుంటావో, అవునని ఆయన్ని సంతోషపెడతావో నీ చేతుల్లో వుంది. మరి బాగా ఆలోచించుకో నా వుద్యోగం, హోదా నీకు తెల్సు ఇంకా వెనుక ఆస్తి పాస్తులు వున్నాయి నీకేలోటు రానివ్వను పువ్వుల్లోపెట్టి చూసుకుంటాను బాగా ఆలోచించే చెప్పు నువ్వు కాదన్నా తప్పేదిలేదు అనుకుంటాను అల్లరి అశాంతి తప్ప ఫలితంసున్న అవునంటే అందరూ సంతోషిస్తారు " మాణిక్యరావు ఆగి కళ్ళజోడు తీసి తుడుచుకోసాగాడు కర్చీఫ్‌తో.

ఆఫీసుజనం ఒకొక్కరే రావటం మొదలయింది

ఆఫీసులో సందడి ప్రారంభమైంది.

"సర్లెండి'' అంటూ అక్కడ్నుంచి రాబోయింది సీత.

''అంటే ఒప్పుకున్నట్టేనా ? ! "
ఆనందం, ఆశ్చర్యం అణుచుకుంటూ అడిగాడు అతను

"ఆలోచించి చెబుతాను."

"అలాగే" అన్నాడు సీత వచ్చేసింది అప్పటికి సుజాత వచ్చి మెషిను సర్దుతూ వుంది."

"ఏమిటి ముసలాయన ఏదో చెప్తున్నాడు," అని అడిగింది సుజాత

"అదొక గొడవ!" అని నవ్వింది సీత.

"అదే, ఏమిటా గొడవని?"

"చెప్తానులే."

అక్కడితో వూరుకుంది సుజాత ఇద్దరూ యంత్రాల్లాగ యంత్రాన్ని నడిపించడంలో మునిగిపోయారు

కాసేపయాక సుజాత పని ఆపింది.

"ఏమిటి సుజాతా?" అంది సీత స్నేహపిచ్చిలంగా, తనూ పని ఆపి

గుండెలమీద చేతులు పెట్టుకుని అదుముకుంటూ "నొప్పిగావుంది సీతా." అంది సుజాత. సీత కంగారుగా లేచింది. ఇద్దరికీ సెలవుచీటీలు వ్రాసి మేనేజరుకిచ్చి వచ్చింది రిక్షామీద ఇద్దరూ డాక్టరు కళ్యాణి దగ్గరికి వెళ్ళారు,

డాక్టరు కళ్యాణి సుజాతని పరీక్ష చేసింది "ఏంలేదు,నీరసంవల్లఅలాగైంది కొద్దిగా జ్వరంకూడావచ్చింది కాస్త పని తగ్గించు. పళ్ళు అవీ తీసుకో, మందులు, టానిక్ రాసిస్తాను" అంది డాక్టరు కళ్యాణి సుజాతకు దూరపుచుట్టం అవుతుంది

"ఈ అమ్మాయి ఎవరూ?" అంది కళ్యాణి ఇంజక్షన్ ఇస్తూ, సీతని

"నా బెస్టుఫ్రెండ్, మనవాళ్ళే" అని పరిచయం చేసింది సుజాత సీత చేతులు ముడిచి నమస్కారం చేసింది

డాక్టరు కళ్యాణి గలగల మాట్లాడుతుంది, మంచి కలుపుగోలుతనం వున్న మనిషి, కాఫీలు తెప్పించింది

పనయాక వాళ్ల వచ్చేస్తూవుంటే "అవసరం లేకపోయినా అప్పుడప్పుడు వచ్చిపోతుండండి, ఏదో నాకు కాస్త రిలీఫ్ అన్నట్లు మనం ఒకే ఏజ్ గ్రూపు వాళ్ళమవటం వలన సర్దాగా కల్సిపోవచ్చు," అంటూ హెచ్చరించింది కళ్యాణి,

మందులు కొనుక్కుని బయటికి వచ్చాక 'ఇక వెళ్తావా?' అంది సుజాత

"ఎక్కడికి వెళ్లను?" అంది, సీత గాబరాగ.

"అదే ఆఫీసుకి.ఇప్పుడు నాకు బాగానే వుందిలే:"

"భలేదానివే, నిన్నిలాగ వదిలిపెట్టి నే నాఫీసుకు వెళ్ళనా? పద పద" అంది సీత స్నేహితురాలి రెక్క పట్టుకొని.

ఇద్దరూ సుజాత ఇల్లు చేరేసరికి రాజారావుగారు ఇంటిదగ్గరే వున్నారు

"ఎలా వుందమ్మా?" అని అడిగారు.

"బాగానే వుంది నాన్నా, అయినా నీకెలా తెల్సు?" అంది సుజాత ఆశ్చర్యంగా.

ఆయన నవ్వాడు, కళ్యాణి మా ఆఫీసుకు ఫోనుచేసిందిలే ఒక స్నేహితురాల్ని తీసుకుని కళ్యాణిదగ్గరకు వైద్యానికి వెళ్ళి ఇంటికి వచ్చావని చెప్పింది, ఈ అమ్మాయేనా ఆ పిల్ల?"

"అవున్నాన్నా."

సీత ఆయనకి నమస్కారం చేసింది.

"ఆశీర్వాదం తల్లీ. సుజాత తల్లిలేనిపిల్ల. నేను అసలే కంగారుమనిషిని, నేను ఆఫీసుకి వెళ్ళివస్తాను అన్నట్టు దుర్గారావు వచ్చాడా?" రాలేదన్నట్టు తలూపింది సుజాత, సీత ఆశ్చర్యంగా వింటూ వుండిపోయింది.

"సర్లే నేను వెళ్ళివస్తాను. జాగ్రత్త తల్లీ!" అని హెచ్చరించి రాజారావుగారు వెళ్ళిపోయారు.

"ఏమిటా ఆశ్చర్యం?" అందిసుజాత.

"ఏంలేదు!"

"అన్నట్లు నీకోమాట చెప్పటం మర్చిపోయాను, సీతా!" అంది సుజాత నీరసంగా.

"తర్వాత చెప్తువుగానిలే, పడుకో, రెస్టు తీసుకో, కాఫీ కలుపుకురానా?"

"థాక్స్ - అలాగే. వంటగదిలో అన్నీ వున్నాయి. కాస్త వెతుక్కోవాలి."

"అలాగే."

కాఫీ కలిపి తీసుకొచ్చింది సీత. "మరి నీకో?" అంది సుజాత. నాకు వద్దులే, నువ్వు తాగు."

"నథింగ్ డూయింగ్. ఫిఫ్టీ - ఫిఫ్టీ" అంటూ బలవంతంచేసింది. సీతకూడ తాగక తప్పలేదు. కాసేపు అయాక టానిక్ తాగించి బత్తాయిపండు ఒలుస్తూ వుండిపోయింది సీత. పైకి చూస్తూ ఆలోచనలో పడింది సుజాత

"సుజాతా!"

"ఊఁ"

"ఒక సలహా కావాలి, ఇస్తావా?"

"అలాగే"

"నేను మాణిక్యరావుగార్ని పెళ్ళి చేసుకుంటే ఎలాగుంటుంది?"

సుజాత ఉలిక్కిపడింది. "జోకా?" అంది వెంటనే సంబాళించుకుని

"నిజం, ప్రామిస్!"

"షటప్, కలలో కూడా ఆ మాట రానీకు" కోపంగా అంది సుజాత.

"కాని అదే నిజమవుతుందేమోనని పిస్తూంది."


సుజాత లేచి కూర్చుంది "ఆర్యూ సీరియస్?!"

సీత తలాడించింది

"సీతా! నాకు చాల చిత్రంగా వుంది. ఆశ్చర్యంగానూ వుంది భయం కూడా అనిపిస్తూ వుంది. సుఖంగా బ్రతకటానికి అందరికీ హక్కువుంది సీతా! నీక్కూడా. భయంకరమయిన దారులవెంట బ్రతుకుని తీసుకుని వెళ్ళవద్దు."

ప్లీజ్! అర్థించింది సుజాత

మౌనంగా వుండిపోయింది సీత.



ఏమిటో ఈ మనుషులు!! గంట గంటకీ నీళ్లు తాగ్గ పోతే గాని బతక లేరు!! పైగా ఎంత బడాయో వీళ్లకి!! హు!!!

కాసేపటికి నోరుపెగల్చుకుని - ఆ తర్వాత చాలసేపు చాల ముచ్చట్లు చెప్పు కుంటూ పోయింది, స్నేహితురాలికి సుజాత వింటూ వుండిపోయింది

గాలిలో దీపంవంటి కుటుంబపు తీరు, రోజు రోజుకి మరింత బిగిసిపోతున్న సమస్యలు, ఆ చిక్కుల్ని విడదీయ టానికి తను పడే తాపత్రయాలు, అంత లోనే ఉత్సాహం తెచ్చిపెట్టేఆ ఆశలు, మరుక్షణం విఫలమై మనసుని క్రుంగ దీసే వాటి తీరుతెన్నులు అలా ఆశ కలిగించి చివరికి మూసుకుపోతున్న బ్రతుకుదారులు, భయం గొల్పుతున్న భవిష్యత్తు !

విని విని అలిసి నిద్రపోయింది సుజాత, మధ్యలోనే.

వొలిచిన పండుని సాసర్లో పెట్టి మరో సాసరు దానిమీద మూతపెట్టి లేచింది సీత

కప్పులు కడిగి వంటగది సర్దింది

సాయంత్రానికని కాసిని బియ్యం తీసి ఏరింది బుట్టలోంచి నాలుగు బెండకాయలు తీసి ముక్కలుగా తరిగి పెట్టింది

ఇంకా సుజాత నిద్రపోతూనే వుంది.

వీధి తలుపువేసి, డాబామీదికి అల్లు కొచ్చిన సన్నజాజి తీగనుంచి నాలుగు పూలుకోసుకొద్దామని మెట్లెక్కింది. పైకి వెళ్ళగానే హాయిగా చల్లటి పిల్లగాలి వొంటికి తగిలింది !

అంతలో ఏవో అరుపులు విన పడ్డాయి. పూలుకోయబోతూ వున్న సీత ఆశ్చర్యంగా అటు తిరిగింది.

సీత కాలు చేతులు స్తంభించాయి !

ఆశ్చర్యంతో, భయంతో నిలువుగ్రుడ్లు వేసుకుని చూస్తూ నిలబడింది సీత ॥

## 4

ఆ ఇంటికి నాలుగిళ్ళవతల పాడు పడిన ఒక ఇల్లు వుంది విశాలమయిన ఆ ఇంటి ఆవరణలో చెట్లక్రింద చాపలు పరిచి వున్నాయి ఆ చాపలమీద కొందరు మనుషులు కూర్చుని పేకాటలో దీక్షగా మునిగిపోయారు పేకముక్కలు గబగబ నడుస్తున్నాయి. డబ్బు చేతులు మారుతూ వుంది. కూర్చుని అలా ఆడుతుంటూవున్న ఆ మనుషులకి ఇవతలగా - ఒక మనిషిని ముగ్గురు మనుషులు చుట్టుముట్టి వున్నారు

ఆ ముగ్గురిలో ఒకతను బలిసిన దున్నపోతులాగా వున్నాడు. చారల బనీను, గళ్ళపాంటులో టకప్ చేసాడు అతను బిగ్గరగా అరుస్తున్నాడు మిగతా ఇద్దరు అతని ప్రక్కన చేరి చోద్యం చూస్తున్నారు

ఆ చారల బనీను దున్నపోతు చేతులు బిగిసివున్నాయి ఆ చేతుల్లో ఆ నాలుగో మనిషి చొక్కా వున్నది. ఆ మనిషి గిజగిజలాడుతున్నాడు లబలబ మంటున్నాడు, ప్రతిమాలుతున్నాడు. దీనంగా మొహంపెట్టి వున్నాడు

అతను రాఘవయ్య !

''నాన్నా ! నాన్నా !'' అంటూ గొణిగింది సీత. నరాలు గజగజ వణికేయి, గుండెలు ఎగసిపడ్డాయి

చివరికి ఆ ''బనీను'' రాఘవయ్యని వదిలిపెట్టాడు

''రేపు సాయంత్రంలోగా బాకీ తీర్చకపోయావో జాగ్రత్త, ప్రాణాలు తీస్తాను'' అని కొన్ని బూతులు కూసి అటూ ఇటూ వూపి వదిలిపెట్టాడు రాఘవయ్యని. అప్పుడుగానీ వూపిరి వదలలేకపోయింది సీత పెద్దగా నిట్టూర్చి గబగబ క్రిందికి పరుగెత్తి వచ్చింది. చాలసేపటివరకు గుండెదడ తగ్గలేదు. వంటగదిలోకి వెళ్ళి మంచినీళ్ళు తాగింది. ఇటూ అటూ కాసేపు తిరిగింది. ముందు గదిలోకి వచ్చేసరికి అప్పుడే కళ్ళుతెరిచిన సుజాత అడిగింది.

''ఏం ? అలా వున్నావు ?''

''ఏం లేదులే'' అంటూ ఎదురుగా కూర్చుని వొలిచిన బత్తాయి తొనలు విడదీసి అందించింది సీత, సుజాతకి. సుజాత మొహాన చెమట పుట్టివుంది. మౌనంగా కొన్ని క్షణాలు గడిచిపోయేయి


''అన్నట్టు అయాం సారీ, సీతా ! ఒక ముఖ్యమయిన పనిచెయ్యటం నేను మరిచాను ''

''ఏమిటది ?''

''ఒకమాట చెప్పమంటావా ?''

''ఊఁ ''

''నేన్నీకు చెప్పలేదూ ? దుర్గారావు వూళ్ళోనే వున్నాడు ! ఎవరో ఫ్రెండు కనిపించి బలవంతం చేసాడట.




అందువలన అతను ఆగిపోయేడు ఇవాళ్టికి ''

సీత కళ్ల పెద్దవిచేసి చూసి రెప్ప లల్లార్చింది

"ప్రొద్దుట అతను మా ఇంటికి వచ్చి నాన్నతో చాలసేపు మాట్లాడి వెళ్లేడు. నాన్న అతన్ని కేకలు వేసేరు."

"ఎందుకు ?" అంది సీత తల వంచుకుని ఆలోచిస్తూ, "ఎందుకేమిటి, మనిషి అలాగ తయారయితే ఎవరు మాత్రం ఊరుకుంటారు సమస్యలు అందరికీ వుంటాయి అంతమాత్రానికి అలాగు డీలాపడి ఆరోగ్యం చెడగొట్టుకోవాలనుందా ? అయినా అతనికేం తక్కువయిందని ."

సీత మౌనంగా వుండిపోయింది

"అతను అలాగ ఎందుకు అయేడో నీకు, నాకు, అతనికితప్ప నాలుగో మనిషికి ఈనాటివరకూ తెలీదు. అన్నట్టు అతను నీకు ఒక ఉత్తరం రాసి నీకిమ్మని ఆ బాధ్యత నాకు వప్ప చెప్పాడు. ఆ సంగతే నేను మర్చి పోయానంటున్నది : చదువుతావా ఇప్పుడు ?"

తల ఊపింది సీత.

సుజాత లేచి తలగడక్రింద వెతికింది ఆ తర్వాత వెతికి వెతికి బేబులు డ్రాయర్లోంచి ఒక కవరు పట్టుకొచ్చింది.

కవరు చించి, "ఎంత వుబలాటంగా వున్నా, నేను చదవలేదు, అది అతను నీకు రాసింది అందువలన అనుచిత మనిపించి నా కోరికని నాలోనే అణగద్రొక్కుకున్నాను" అంటూ అందించింది, ఆ వుత్తరాన్ని అది అందుకుని చదువుకుంది సీత

"సీతగారూ !"

నేను దురదృష్టవంతుణ్ని ఎంతగా ప్రయత్నించినా మిమ్మల్ని నా మనోఫలకంనుంచి చెరిపివేసుకోలేకపోతున్నాను వాస్తవానికి నాకు ఈ ఊరు రావలసిన వేరే పని ఏంలేదు. నేను కేవలం మీ కోసమే అంత దూరంనించి వచ్చానని ఎవరికీ తెలీదు. ఈ సంగతి మీరు నమ్ముతారా ? నోటితో చెప్పలేనేమోననుకుని నా మనసుని కాగితం మీద పెడుతున్నాను. ఇప్పటికీ నా మనసు మీ కోసమే తాపత్రయపడుతూ వుంది. అన్ని విషయాలూ ఇదివరకే మీకు చెప్పి వున్నాను ఇకనయినా మీ మనసు మార్చుకుని సరే ననరూ ? కనీసం నా పరిస్థితికి జాలిపడయినా మీరు ఒప్పుకోలేరూ ?

సీతా ! నా వలన ఏమయినా పొరపాటు జరిగిందా ? నాకు తెలిసిగాని తెలీకగాని మీ మనసుని నొప్పించితే అందుకు హృదయపూర్వకంగా క్షమాపణ కోరుకుంటాను ఇది నా ఆఖరి ప్రయత్నం. నాలో ఇంకా చావని ఆశే నాచేత ఈ పని చేయిస్తోంది నన్ను క్షమించండి, ఇప్పుడూ మీరు కాదంటే మరల మీకు కనిపించనని మాటయితే ఇస్తున్నాను నా అదృష్టం ఎలా వుందో మరి ! – ఇట్లు దుర్గారావు."

చదవటం ముగించి ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించేసింది సీత

"ఎందు కట్లా చించేసావు ?'' అని అడిగింది సుజాత ఆశ్చర్యంగా "ఆ విషయం నా మనసులోనే చెక్కుచెదరక నిల్చిపోతుంది ఇంకా ఇది ఎందుకు ?" అంది సీత.

"అతను ఏమంటాడు ?"

సీత తలొంచుకుంది, అశ్రువులతో కళ్ళు నిండిపోయాయి. ధారలుకట్టి బుగ్గలమీద చారికలు ఏర్పడ్డాయి

సుజాత చలించింది

లేచి వచ్చి ప్రక్కన కూర్చుని కన్నీరు తుడిచింది

"పిచ్చిదానా ! ఎందుకేడుస్తావు ?" అంది

"ఇది ఏడ్పుకాదు సుజా ! సంతోషం."

"మరి ఆ కన్నీరు ?!"

"అవి ఆనందబాష్పాలు."

"సరే, నేనూ ఆనందబాష్పాలు రాలుస్తాను, విషయమేమిటి చెప్పు"

"అది నీకు తెలిసిందే."


"అవుననుకో, నీ నిర్ణయంమీదగదా, దాని తీరుతెన్నులు ఆధారపడి వుండేది ! అదేమిటో చెప్పమనే, నేననేది."

సీత మౌనంగా వుండిపోయింది.

"మరేం తొందర లేదులే నిదానంగానే చెప్పు."

తలాడించింది సీత

ప్రొద్దువాటారింది సాయంత్ర



మయింది. స్నేహితురాళ్ళిద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వుండిపోయారు

ఉన్నట్లుండి సుజాత మౌనాన్ని భంగంచేసింది.

"అన్నట్టు సీతా, మర్చేపోయాను. నాన్నగారు సాయంత్రం భోజనానికి ఒక అతిథిని పిలిచారు. నాకు చూస్తే ఇలాగయింది. ఇక ఆ బాధ్యత నీది. వంటగది నీకు అప్పచెప్పాను అన్నీ వెతుక్కుని ఏం చేస్తావో - అతిథుల్ని ఎలాగ సంతృప్తిపరుస్తావో నీదే బాధ్యత "

"అలాగే" అంటూ లేచింది సీత.

వంటగదిలో చాలసేపు తంటాలుపడి ఏవి ఎక్కడున్నాయో తెలుసుకుంది.

బుట్ట అడుగునించి బంగాళా దుంపలూ, దొడ్లోనించి ఒక ఆకు కూరా తీసి తెచ్చి తరిగింది. పప్పుచారుచేసి, నాలుగు అప్పడాలు వేయించింది. చేసిన వన్నీ గిన్నెల్లో సర్ది వంటగది తలుపు

వేసి ఇవతలికి వచ్చేసరికి ప్రొద్దు గూకింది చీకటి పడింది.

ఇంట్లో లైటువేసి ఇవతలకి వచ్చే సరికి సుజాత లేచి మొహం కడుక్కు వచ్చి అడిగింది ''అంతా అయిపోయి నట్లేనా ?"

"ఆఁ"

''గుడ్ మంచి అమ్మాయంటే అలా గుండాలి" అని నవ్వింది.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్. ఇదంతా నీ నుంచి నేర్చుకున్నదే సుమా !"

"ఓహో ! మళ్ళీ మెలిక నాకే వేసావన్నమాట."

''యస్ మేడమ్"

ఇద్దరూ పకపక నవ్వుకున్నారు.

"సరేలే, టయిమయింది. మందు వేసుకొని బత్తాయి రసంతాగి పడుకోండి మేడమ్."

"ఓ యస్, మైడియర్ ఫ్రెండ్. కాని ఇపుడు నేను బాగానే వున్నాను."

సీత బలవంతంవల్ల అయిష్టంగానైనా టాబ్లెట్స్ మింగి రసం తాగి పడుకుంది సుజాత

వాకిట్లో చప్పుడయింది

రాజారావుగారూ, మరో వ్యక్తీ ఏదో మాట్లాడుకుంటూ వచ్చారు వెనుక గదిలో తలుపుచాటున ఒదిగి నిలబడింది సీత

"ఎలా వుంది సుజీ ! ఆ అమ్మా యేది, వెళ్ళిపోయిందా ?" – రాజారావు.

"సుజీ కేమయింది బాబాయ్ ?"

"జ్వరంవచ్చి ఎలా అయిందో చూడు."

"మరేం కంగారు లేదులే నాన్నా. స్లయిట్ ఫీవర్, రేపటికి తగ్గిపోదూ ?!" అని నవ్వింది సుజాత. నవ్వి "సీతా ! సీతా !" అంటూ పిల్చింది

బయటికి రాబోయిన సీత కాళ్ళు నిల్చిపోయేయి తననే చూస్తూ వుండి పోయిన దుర్గారావుని గమనించి తడబడింది

"మరల సీత ఇంటికి పోవాలని తొందరపడుతూ వుంది నాన్నా. మీరిద్దరూ కాళ్ళు కడుక్కుని కూర్చోండి" అంటూ తొందర పెట్టింది సుజాత.

వాళ్ళిద్దరూ కూర్చుంచే ప్రక్కనే ఊరికే తనూ కూర్చుంది సుజాత. సీత వడ్డించింది.

"ఇవాళ వంట బ్రహ్మాండంగా వుందమ్మాయ్ !" అన్నారు రాజారావు గారు. ''అక్కడికి రోజూ బాగాలేదని కాదనుకో. ఈ పూట ఇంకా బాగా వుందని నా ఉద్దేశ్యం'' అని నవ్వారు.

"స్టేట్మెంటుకి కరెక్షన్లక్కరలేదు నాన్నా. సీత వంట బాగా చేస్తుందని నేనూ వప్పుకుంటాను" అని నవ్వింది సుజాత.

"నేనూ చాలా రోజులకి మంచి భోజనం చేసాను'' అని మెచ్చుకోలుగా సీతవంక చూసాడు దుర్గారావు. సీత తలవంచుకొని సిగ్గుపడింది. ఇద్దరికీ వడ్డించింది. మనసులో ఏదో తృప్తి !

వాళ్ళ భోజనం అయాక అన్నీ సర్ది ఇవతలకి వచ్చింది సీత వాళ్ళు వాకిట్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు సీతని చూసి లేచి ఇవతలికి వచ్చింది సుజాత

"సీతా ! నువ్వూ భోంచేశావా ? నీ సంగతే మర్చిపోయాను సారీ !"

''లేదులే ఇంటికి వెళ్ళి చేస్తాను "

"నీ మొహం, ఎంతసేపు ! రా నే పెడతాను "

"థాంక్స్ ! నేను వెళ్ళాలి అవతల మా వాళ్ళందరూ నా కోసమే చూస్తుంటారు ప్లీజ్."

"సరె నీ ఇష్టం అన్నట్లు ఏంచేశావ్ ! దుర్గా...మాట ఇలా రా " అంటూ పిల్చింది సుజాత

దుర్గారావు లేచి వచ్చాడు రాజారావు గారు లోపలికి వెళ్ళిపోయారు.

"ఇక సీత వెళ్తానంటోంది అందు కని పిలిచాను. అన్నట్లు నేను ఒక విషయం మరచిపోయాను ఇప్పుడే వస్తా మాట్లాడుకుంటూ వుండండి" అంటూ లోపలికి వెళ్ళింది సుజాత.

చీకట్లో ఎదురు బొదురుగా నిల బడ్డారు ఇద్దరూ.

ఏదో మాట్లాడాలని ఇద్దరికి వుంది. కాని ఎవరూ ఏమీ మాట్లాడలేకపోతున్నారు గుండెల సంచలనం, మనసుల వూగిసలాట, ఆందోళన, ఆతురత

చివరికి దుర్గారావే నోరు పెగుల్చుకుని అన్నాడు

"సుజాత ఉత్తరం ఇచ్చిందా ?"

తల వూపింది సీత.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

మరల దుర్గారావే అన్నాడు.

"ఏమిటో సీతా ! ఒకొక్కరికి ఒకొక్క బలహీనత ఉంటుందంటారు. నా బలహీనతని నేను జయించలేకపోతున్నాను. ఏం అనుకోకు ఏదో పిచ్చివాడయి అలా ఉత్తరం రాశాడనుకొని నన్ను క్షమించు "

సీత మాట్లాడలేదు.

"రేపు తెల్లవారుజామునే నేను వూరు వెళ్ళిపోతున్నాను మరల ఇక రానేమో! అన్నట్టు మా అమ్మ నా పెళ్ళి గురించి తొందరపెడ్తుంది ఆమెకి మాత్రం నేను తప్ప ఇంక ఎవరున్నారు ? ఆమె కోరిక తీర్చక తప్పదు కాని నేను ఆమెను సంతృప్తిపరచగలనా అని !" దుర్గారావు ఆగి సీతవంక చూసాడు

సీత తల వంచుకుంది.

"ఏమంటావు సీతా ?"

సీత ఏమీ అనలేకపోయింది. ఆమె కంటివెంట గిర్రున నీరు తిరిగింది.

దుర్గారావుకి గుండె భారంగా అయి నట్లనిపించింది.

"నిజమే! ఇదివరకు ఒకసారి నాలోని ఆశ చచ్చింది కాని చిత్రంగా ఆ ఆశ ఇన్నాళ్ళకి బ్రతికి మరల చిగురిస్తా నంటుంది అదొక మొండితనం నేను వచ్చేటప్పుడు పెద్ద ఆశనే వెంటబెట్టుకొని వచ్చాను ఆ ఆశ ఫలించి సంతోషం తోనే తిరిగి వెళ్తాననిపిస్తూవుంది, సీతా నాకు!"

సీత వులికిపడింది

ఆమెకి మాణిక్యరావు మాటలు గుర్తుకు వచ్చాయి!

ఆ వెంటనే తనవాళ్ళందరూ గుర్తు వచ్చేరు

తల్లి వట్టి పిచ్చిది. బోళామనిషి, మాట పెళుసు ఓపిక తక్కువ అమా యకురాలు

తండ్రీ మంచివాడే మొదటినుంచీ అయన పని అలాగయింది ఏ పనీ చెయ్యడు నిలకడలేదు బలహీనతలు కొల్లలు. కుటుంబాన్నిమాత్రం పెంచాడు

రాజుకి బాధ్యత తెలియదు. సర్దాల్ని మాత్రం చంపుకోడు ఆలోచనలేదు, ఆవేశంమాత్రం కావలసినంత అంతలో కోపం నిదానం, నిలకడ ఇంకా అలవడ లేదు. కుటుంబానికి అతడే ఆశా దీపం ఆ దీపం పుంజుకుని జ్వలించి వెలుగుల్ని పంచాలన్న ఆశ అందరికీ!

లలిత ఇంకా మంచి చెడు తెల్సుకోదు. ఆలోచనలేని మనిషి ముందు ముందు వున్న జీవితాన్ని గురించి ఆలోచన లేదు అందుకే ఇంకా తడబడ్తూనే అడుగులు వేస్తూవుంది, బ్రతుకు బాటలో.

శశికి ఆలోచనవుంది. కాని వాడు అర్భకుడు పైగా అవిటివాడు.వయసుకు మించిన ఆలోచనలు వాడివి. ముందున్న బంగారు జీవితాన్ని గురించి కలలు కంటాడు

ఇప్పుడు ఈ అందరికీ తనే ఆధారం. వాళ్ళంతా తనవాళ్ళు! తనమీదనే ఆశలు నిల్పుకున్న తనవాళ్లు! తనే కాదంటే వాళ్ళంతా ఏమయిపోతారు? ఈ కుటుం బము ఎటువంటి పరిస్థితుల్లో పడి పోతుంది!! ఇదీ తన అస్తిత్వం తను ఇందులోనే పుట్టింది ఇందులోనే పెరి గింది. ఆశలు పెంచుకుంది. చీకటే అని పించినా ఆ చీకట్లోనే తడుముకుంటూ వెలుగుకోసం వెతుక్కుంటుంది

ఒకవేళ ఎవరయినా నిన్ను పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడినా అది నీ సంపా దనకోసమే గాని అభిమానంతో మాత్రం కాదనేది పచ్చినిజం అటువంటప్పుడు అతడు మీ నాన్న సంసార బాధ్యతని నెత్తిన వేసుకుంటాడా అన్నది అనుమానా స్పదమే ఒకవేళ ఆ పూవులో మొదట అందుకు సిద్ధపడినా ఆ తర్వాత అతడు మాట చెల్లించుకుంటాడన్న నమ్మకం ఏమిటి? ఇవన్నీ ఆలోచించి ఎంతో

ఆందోళన చెందాడు మీ నాన్న"... అన్న మానిక్యరావు మాటలు చెవుల్లో గింగురులెత్తి మోగినట్లనిపించింది

దుర్గారావు మంచివాడు మనసున్న వాడు "తన" చెయ్యి అందుకోవటం కోసం తనే అన్నిటికీ సంసిద్ధతని వెలిబుచ్చాడు కాని అతడు యువకుడు ఆవేశం వున్నవాడు పైగా ఒంటరీ కాడు అతని వెనుక అతని తల్లి వుంది బంధువులున్నారు. వాళ్లయినా వూరుకోవాలని లేదు - కనుకనే తను కాదంది. అయినా తను వదల్దు ! ఆలోచించిన కొలదీ అయోమయ మన్పిస్తుంది

తనూ ఒంటరికాదు తనతోనే తన వాళ్ళుంటారు తన గురించి ఆ బాధ్యతని భుజాల కెత్తుకోవటానికి అతను సంసిద్ధుడే అయినా లోకం హర్షించదు హీనమయిన పరిస్థితిని ఎదుర్కోవాలి, తనూ, 'వాళ్ళు !'

సీత తల గిర్రున తిరిగింది

మనసు లాగుతుందిగాని ఆ మనసుని చంపటానికి అభిమానం చురకత్తులతో సిద్ధమవుతుంది - నరికి పోగులు పెడతానంటుంది ! కన్నె మనసుని - అందమయిన "అవతలి ఒడ్డు" ఆకర్షిస్తుంది ——

కాని ఎగిరిపడే కెరటాలు నావని ముందుకి కదలనీవు !

వీపుమీద కొరడాదెబ్బ తగిలినట్లు చలించింది సీత

"ఇంకా అవలేదా మీ సంభాషణ ! ఇంతకీ ఏమిటి తేల్చారిద్దరూ !" అంటూ సుజాత వచ్చింది

ఎవరూ మాట్లాడలేదు. బొమ్మల్లాగ నిలబడిపోయారు

"నాన్నగారు పడుకోబోతున్నారు పెందరాళే పడుకోవటం ఆయన అలవాటు పడుకోబోయేముందు ఆయన చేత నేను ఒక 'టాబ్లెట్' మింగించాలి. అందుకే వెళ్ళాను సారీ" అంది సుజాత

"ఫర్లేదులే" అన్నాడు దుర్గారావు నవ్వి.

"మరి వెళ్ళొస్తాను సుజీ ! రేపు కలుద్దాం" అంటూ వెనుదిదిగి నాలుగడుగులు వేసింది సీత.

దుర్గారావు అప్రతిభుడై నిలబడిపోయేడు

కాస్త దూరం వెళ్ళి ఆగింది సీత వెనుకనే సుజాత అనుసరించి వస్తోంది. వెనుదిరిగి చూసింది సీత

దుర్గారావు అక్కడ్నే నిలబడి శిలాప్రతిమలా చూస్తూ వున్నాడు. అతనిలో చలనం వున్నట్లు లేదు

గబగబా వెనక్కి తిరిగి అతని దగ్గరికి వచ్చింది సీత

"నన్ను క్షమించండి నేను దురదృష్టవంతురాలివి !" అతన్తో అని

వెనక్కి తిరిగి వెళ్ళి సుజాతని కలుసు కుంది

సుజాత ఏమిటో చెప్తూ వుంది

అవేమీ సీత మనసుకి ఆనలేదు.

సుజాతకి 'గుడ్‌నైట్' చెప్పి ఇంటి దారి పట్టింది. సుజాతని అప్పుడుగు దామనుకుని ఆ మాటే మరిచింది సీత ! ఇల్లు చేరేసరికి ఇంట్లో సందడిగా వుంది.

శశిధర్ ఎదురువచ్చి చెయ్యిపట్టుకుని ఆప్యాయంగా అన్నాడు, "అక్కా నీ పెళ్ళిట, నాకు చెప్పలేదేం ?"

వాకిట్లోనే రాఘవయ్యగారు చుట్ట తాగుతూ కొలువుతీరి వున్నాడు రాజు, లలిత, సుబ్బమ్మగారు ఆయన కెదురుగా కూర్చుని వున్నారు

సీతని చూచి "ఎక్కడికి కెళ్ళేవే ఇప్పటిదాకా?" అంటూ నిలదీసి సూటిగా అడిగింది సుబ్బమ్మ.

"సుజాతకి జ్వరం వచ్చిందమ్మా. తనగురించే ఆలస్యమయింది"

'ఇటువంటివి సహించటానికి లేదు" అని సకిలించాడు రాఘవయ్య.

'ఒక బాధ్యత అంటూ వుండాలి పరిస్థితుల్ని గమనించాలి" అని మరల సుభాషితం పలికేడు ఆయన

'కూర్చో సీతా !" రాజు ఆదరం చూపించబోయేడు.

"అక్కా" అంటూ పలకరించి లలిత ఏదో చెప్పబోయింది

"సీతా ! నేను ఒకమాట చెప్పుతాను విను మన కుటుంబ క్షేమంకోరి నే నివాళ ఒక విషయం 'సెటిల్' చేసేను అది అందరికీ మంచిదనిపించి అలాగ చేసేను అంతా నిర్ణయమైపోయింది. వచ్చే నెలలోనే మాణిక్యరావుతో నీ పెళ్ళి" అని చెప్పి మౌనం వహించేడు రాఘవయ్య

సీత కనులవెంట గిర్రున నీరు తిరిగింది

"ఇదీ అదృష్టమే అనుకో మనమా కట్నాలు పొయ్యలేము మన పరిస్థితి ఎలాగుంది మరి! ఏదో సరిపెట్టుకుపోవాలి. అయినా అతనికేం తక్కువ?..." సుబ్బమ్మ ఆగింది.

ఆగి "సీతా ! ఇంతకీ నువ్వేమంటావే?" అని రొక్కించింది

సీత తలవంచుకుని కన్నీరు తుడుచు కుంది

"ఏమిటే ఆ పొగరు? మాట్లాడవేం ! అవునో, కాదో ఏదో ఒకటి చెప్పి ఏడవచ్చుగా?"

"నేను అనేదేముందమ్మా, మీ ఇష్టం" అంది సీత నోరు పెగల్చుకొని

"పిచ్చిమోడు ! అదేం ఎదురు చెప్ప దని నేను చెప్పటంలా?" అంటూ రాఘ వయ్యవంక చూసింది సుబ్బమ్మ గర్వంగా చూసి వెంటనే "సర్లే పద పద, ఇప్పటికే ఆలస్యమయింది. ఆ వంట ప్రయత్న

మేదో చెయ్యాలిగద!" అంటూ తరిమింది సుబ్బమ్మ

తడబడే అడుగుల్తో లోపలికి నడిచింది సీత ఇల్లంతా చీకటిగా ఉంది అంతపని చేసినా ఎవరికీ ప్రొద్దుగూకాక ఇంట్లో దీపం వెలిగించాలన్న ధ్యాస లేకపోయింది

దీపాలు వెలిగించి కాలు చేతులు కడుక్కొని వచ్చింది సీత మొహం తుడుచుకుని అలాగే గుమ్మానానుకుని నిలబడిపోయింది. అనాలోచితంగ అలాగ నల్లటి కారుచీకటిలోకే చూస్తూ వుండిపోయింది, కొన్ని నిమిషాలు

అంతలోనే-దుర్గారావు,గుర్తువచ్చాడు మరుక్షణమే మాణిక్యరావు ముది రూపూ తలపుకొచ్చింది మనసు మెలిదిరిగినట్లయి గుండెలు బాధతో విలవిలలాడేయి. ప్రయత్నించి ఆ బాధని నిగ్రహించుకుని కాసేపటికి మనసుని దిటవుపరచుకుంది సీత

కాని, కళ్ళనుంచి జారిన బాష్పధారలు గుండెలమీద వెచ్చగా పడినాయి గుండెలు తడిసిపోయేయి

"సీతా!" లోపలికి వస్తూ సుబ్బమ్మ ఓ గావుకేక పెట్టింది

ఉలికిపడి, ఆ వెంటనే సర్దుకుని గబగబ వంటపనిలో చొరబడింది సీత




బయట - 'వాళ్లు' గలగలా పెళ్ళి కబుర్లు చెప్పుకుంటున్నారు